విషయానుక్రమణిక

జూను, 1943

వర్ణచిత్రము: విశ్రాంతి.

భారతి—వింశతితమ సంపుటము. భా—౧

వ్యాసముల అకారాది సూచి

సంపుటము 20
సంచిక 6

భారతి

స్వభాను జ్యేష్ఠము
1943 జూన్

పానశాల

= కవికోకిల శ్రీ దువ్వూరి రామిరెడ్డి =

[నేను ఈమధ్య రుబాయతు మరల చదువుచుండఁగా, 'పానశాల'లో చేర్చుటకు తగిన కొన్ని రుబాయులు వదలిపెట్టియుంటినని తోఁచినది. వానిని ఇప్పుడు తెనిఁగించితిని.]

౧

పొలముల పూలగాలి వలపుల్ కలఁబోయుచు వీచె; గాజు గి
న్నెలఁ జిలుచేదుపానకము నింపుము; నశ్వరమైన యీస్థితిం,
దెలియుమ యీక్షణం బెరవుదెచ్చిన సొమ్మని; జాఱఁబుచ్చినం
గలికి, మఱెప్పు డిట్టితటి క్రమ్మఱ రాదు; నిజమ్ము; నమ్ముమా.

౨

చెలియ, గులాబిమోముపయిఁ జిందె నుగాదిహిమాంబుశీకరం
బులు; ప్రమదాంఘ్రిచిహ్నములు పొల్చె హృదంతరశాద్వలంబునం;
దలఁచెద వేల నిన్నటి వెతల్; మఱి నేఁడు ముదంబు గూర్పు, ర
మ్మెలమిని బచ్చబైల సెలయేటి తటాలఁ బచారుచేయఁగన్.

౩

చేవల్ చచ్చిన కోరికల్ మరల నుజ్జీవింప నవాబ్దశో
భావాల్లభ్యము వచ్చె; భోగులకు సేవ్యంబయ్యెఁ గుల్యాజల
స్రావంబుల్ వను; లొత్తెఁ గొమ్మలను మూసాశ్వేతహస్తప్రభల్;
ఈవిశ్వంభర క్రీస్తునూర్పులఁ బునర్జృంభించె నాఁ గాంతిలున్.

౪

నాడు యశోవగుంఠనమునం గనుపట్టెను జిల్లుచీలికల్;
పైదలి, మైనఁగాని మధుపానము మానను బ్రాణ ముండఁగన్;
ఆ దరిబేసు లాసవము నమ్మి మఱేమి యమూల్యవస్తు సం
పాదన సేయువారొ విసుమానము నొందుదు వారి చేఁతకున్.

౫

కను మెపుడో యకాండముగఁ గాలము నీపయి దొమ్మిపోటు నే
యునియపుడే గులాబిజిగులారెడు ద్రాక్షరసంబు నానుమా;
తనువు నశించి దుమ్మగుట తథ్యము; నీవు పసిండిముద్దవా
జను లొకసారి పూడ్చి మఱుసారి నినుం బెకలించి యెత్తఁగన్?

౬

సలలితగోస్తనీఫలరసంబును గ్రోలెడువారు, దేవళం
బుల నిశియెల్లఁ బ్రార్థనలఁ బుచ్చెడువారు, జలప్రవాహవీ
చులఁ బడి మున్గినారు; పాడిచోటి కొకండును జేరఁ; డొక్కఁడే
యలరుఁ బ్రబుద్ధుఁడై; మిగతయందఱు మత్తులు పెద్దనిద్దురన్.

౭

నెలఁతా, దేవునికట్లు నాకును జగన్నిర్మాణమర్మక్రియల్
గలవేన్, దుర్విషమప్రచారి యగు లోకంబున్ యథేచ్ఛామతిం
జెలువంబొనటు సంస్కరించి నవసృష్టిం గూర్తు సన్మార్గవ
ర్తులు ప్రాజ్ఞుల్ భువి సర్వసంపదల సంతోషంబుగన్ వర్ధిలన్.

౮

చిరిగిన బొంతలం దొడిగి సిద్ధుల మం చవివేకలోకమున్
మొఱఁగి చరించు దుర్జనుల మోసముకంటెను మేలుగాదె యో
గురువర, కామినీప్రణయగోష్ఠుల నాసవసేవ; త్రావినన్
నిరయము దప్పదన్న, మఱి నీసురలోకము పాడుగాదొకో?

౯

మనకు ముం దేఁగినట్టి యా మాన్యులెల్లఁ
బ్రబలగర్వాంధనిద్రానిబద్ధు లైరి

నెలఁత, మధు వాని నావల్ల నిజము వినుము :
వారు చెప్పిన చదువెల్ల వట్టి కల్ల!

౧౦

కొందఱు ధర్మమున్ మతముఁ గూర్చి నిరంతము చింతసేయ నిం
కొందఱొ సత్యసంశయము లేర్పఱుపం దలదిమ్ము గాంచ, నా
సందున మాటు పీడి "యిఁకఁ జాలును రెండు వెడంగులార, మీ
కందును నిందు లేదు పథ" మంచు మునాది వచించువారికిన్.

౧౧

దేవ, నీవు లేని గుడిఁ బ్రార్థించుకంటెఁ
బానశాలను సత్యంబు పలుక మేలు ;
సృష్టి కాద్యంతములు నీవె; స్రష్ట నీవె;
పాలముంచ నీటను ముంచఁ బ్రభువు నీవె.

౧౨

ఎవ్వఁడు తప్పుసేయఁ ; డిల నెట్టుల జీవిక సాగుఁ, జేయఁడేన్ ;
అవ్వలఁ బాపి నీఁ డనుచు నక్రమశిక్ష విధింతు వౌర ! యీ
రవ్వయు రచ్చ యేల యపరాధుల మిద్దఱ మాట ; నీకు నా
కెవ్విధమైన భేదము రహించునొ శాస్త్ర వచింపు మీశ్వరా.

౧౩

మితిసెడ, సృష్టివేళఁ దనుమృత్తిక నెవ్వఁడు మేళవించె ; జీ
విత సిచయంబునం బడుగుపేకల నన్నియుఁ బట్టు గల్పె ; దు
ష్కృతులను బుణ్యకార్యములఁ జేయ లిఖించెను నొష్ట, వాఁడె దు
ష్కృతులకు మూలకారణము ; కీడును మేలును వాని సేఁతలే.

౧౪

ఈ విషవృక్షలోకమును నింకొకరీతిఁ బునః సృజింపు మం
చే వినతిన్ వచింతు ; నది యిష్టమయేని రచించు చెచ్చెరన్ ;
దేవ, మదీయ నామమును దెవ్వునఁ బట్టికఁ గొట్టివేతువో,
నావయసున్ శతాధిక మనన్ నవరింతువో చూడఁగావలెన్.

విశ్వనాథ పంచశతి

= శ్రీ విశ్వనాథ సత్యనారాయణ =

పేడ చేయుచున్న వెలంది! విశ్వామిత్ర
మునికి నీదు భర్త ఋణపడియెనో?
నీదు భర్తలైన జూదమం దోడిరో?
అతఁడుగాని కలిసమాశ్రితుండో? (౧౧౦)

ఉరుకులాడుచు ప్రేపల్లెనుండి వచ్చి
వడ్లు దంపుచు నుండె నీపద్మనేత్ర
మున్ను రైక నెత్తుక చన్న చిన్నికృష్ణుఁ
డా వెంటొమ్మున నిపుడు ముత్యాలు పోసె.
(౧౧౧)

తా నింత ప్రియము పడదేని [నే
చాన మొగము త్రిప్పుకొన్నఁ జాలు, గొణుఁగు
దో నింద, ముడిచి కన్బొమ
సూనరి రాడీల వెలిరుచుల్ మరగినదో.
(౧౧౨)

ప్రాతవడ్ల సరంజాము, బాకువిల్లు;
నంగుఁ డార్జించె జంటఫిరంగులాది
చట్టుబండలై, లక్షణశాస్త్రమార్గ
మార్చి 'మిలిటరీడిక్టేట' రమ్యె మరుఁడు.
(౧౧౩)

అవునె రోసి పొలమ! అయ్యయ్యో! అంతంత
నెత్తె లేల పడితి నీవుగాని
ప్రాణమిత్రుఁడట్టు లరుదెంచి తడియార్చి
కృత్రిముం డెవఁడు వగిల్చె నిన్ను? (౧౧౪)

మొదటిసారి ప్రియుఁడు ముద్దిడుకొన్నంత
కన్నె బెదరి క్రొత్తకాల్వక్రింద
సాగు పొలము దంపనాఁగలి లాఁగిన
పెళ్ల తిరిగినట్లు తెల్లవోయె. (౧౧౫)

చిన్నిపూవుకన్నఁ జివురాకు మెత్తన,
దానికన్న పిల్లదాని తలఁపు,
తలఁపుకంటెఁగూడఁ దొలియీఁతయావెన్నఁ
బెట్టినట్టి దివ్యపిల్ల వలపు. (౧౧౬)

అమెరికాదేశమందు ననంగజుండు
లావుపెదిమలు బొగ్గునల్లనగు మేను
అచ్చరలు వాని యందాని కభిసరింత్రు
అతనికశివదృగ్వహ్నిదాహములు వేలు.
(౧౧౭)

అల్ల కరణము 'బీ'ఫారమందుఁ బెట్ట
భయపడిన రైతు; తా మోతుబరివిధాన
గట్లు మార్చి; పోరంబోకు గడుముకొనెడుఁ
గన్యలను బ్రహ్మచారులఁ గాయజుండు.
(౧౧౮)

పరమసుకుమార! మాయూరి చెఱువునీళ్ల
మురికి యంచును బెదరంగఁబోకు పోకు
చివురుసంజలయందు దక్షిణపుగాలి,
అచ్చరల యత్తరుల కొంగు లంటివచ్చు.
(౧౧౯)

రమణి! నే నంత సామంతురాల కాను, - ఇల్లు దవలి రా నాస్కారమింత లేదు
దాని దుంప తెగిరి లే, జగాన నెల్ల - వనితలును నందగాండ్రకే భార్య లైరె? (౧౨౦)

ఆంధ్రభాషాచరితము -
ధాతువులు

[అనువృత్తము]

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

ఆంధ్రవైయాకరణులచే నీభాషలో ధాతువులుగా బరిగణింపబడిన 'గు'వర్ణాంత, 'చ్చు' వర్ణాంతరూపముల పూర్వచరిత్ర నన్వేషించి పరిశీలింపగా నివి వాస్తవముగ భాషలో ధాతువులుగ బరిగణింపబడదగిన మూలరూపములు కావనియు, యత్కించిదర్థభేదమును సూచించుటకుగా నితర ధాతువులతో గూడి కాలక్రమమున జేర్పడిన ధాతుపల్లవము లనదగిన వైయుండెననియు మనకు దెలియవచ్చుచున్నది. ఆయారూపములలోని 'గు'వర్ణ మొక మూలధాతువునకు సహాయధాతువుగా జేర్పబడిన 'అగు'అనుదాని యవశిష్టరూప మైయుండు ననియు, 'చ్చు' అనునది 'ఈ' ధాతురూపాంతరమగు 'ఇచు' అనుదాని 'చు'వర్ణము తొలిధాతువు తుదినున్న రేఫాది వర్ణములతో సమీకరణమునొందుట (Assimilation) వలన జేర్పడిన దనియు గూడ నూహింపదగియున్నది. ఇట్లే 'గు', 'చు', 'చ్చు' మొదలగు వర్ణములను ఆయారూపములనుండి విడదీసి వాని స్వరూపమును మనము గుర్తింపగలిగినచో, నిక మిగిలిన మూలరూపములు—అనగా అడ్, తున్, తెర్, వెళ్, పెర్, తిర్, కీల్, కాయ్, వర్, తర్, చూర్, చా, పో మొదలగునవి చాలవరకు ఏకాచ్ధాతువులుగ నుండె ననుటకు సందేహము లేదు. ఇవియే యితర సహాయధాతువులతో గూడి యాయా రూపము లైనవని గ్రహించితిమి. వీనిపై 'ఈ' ధాతురూపమగు 'ఇచు' చేర్పగా 'చ్చు' వర్ణాంతరూపము లేర్పడిన వని చెప్పుచున్నారుగదా. ఈ 'ఇచ్చు' ధాతు వెట్లు వచ్చినది? 'చు' వర్ణమే ఆయా యర్థముల జేర్పబడిన దనుకోరాదా అను ప్రశ్న కలుగ వచ్చును. అట్లే 'అ' ధాతువుగా గ్రహించినప్పుడు 'అగు' 'ఆగు' అనుదానిలో గూడ 'గు' వర్ణము కనబడుచున్నది గదా, తక్కిన ధాతువులపై 'అగు' చేరినదనుట కంటె ఏదో అర్థములేని 'గు' వర్ణమే చేరిన దనుకొనుట యుక్తముగదా అనియు ననవచ్చును. వాస్తవమే. కేవల ప్రత్యయాంత భాషయైన (Completely inflexional language) సంస్కృతభాషాసామ్యదృష్టితో జూచినప్పు డట్లుతోచుట న్యాయమే. అందలి వికరణ ప్రత్యయములకుగాని, క్త్వార్థకణిజాద్యర్థక ప్రత్యయములకుగాని అర్థమేమో, వాని మూలరూపము లేవో తెలిసికొనుటకు మన కవకాశము కలుగుటలేదు. కావున నాదృష్టితో జూచినచో నట్లే ఇచ్చటను తటస్థించియుండు ననుటకు సందేహములేదు. కాని యీ ద్రావిడభాష లట్టి నిరూఢమైన ప్రత్యయాంతత్వస్థితిని బొందని వగుటచే నాయాభాషలలో నిలిచియున్న రూపములను బరిశీలించినచో గొంతవర కాయాప్రత్యయము లనబడువాని మూలరూపములను గనిపట్టుట కవకాశ మేర్పడగల దని యూహింపవచ్చును. కావున సంస్కృతభాషావ్యాకరణ సామ్యదృష్టితో గాక ద్రావిడభాషా స్వరూపతత్వ పరిశీలనదృష్టితో జూచినచో వీని మూలరూపములను గనిపట్టవచ్చునేమో యారయవలసియున్నది. అట్లు

విచారించినచో నర్థభేదచ్ఛాయలను సూచించుటకుగా నొక ధాతువుపై మరియొకధాతువును జేర్చి చెప్పుట యిప్పటికి నీభాషలలో సాగుచునేయున్న దని మన మింతకుబూర్వమే గ్రహించియున్నాము గావున నీ సూత్రమే ప్రాచీనకాలమున గూడ ననుసరింపబడి యుండునని తలచినచో నీ ధాతురూపములపై జేరిన యితర ధాత్వవశిష్టరూపములే కాక, నామవిభక్తి ప్రత్యయములు, క్రియారూపములలో భిన్నార్థముల జేర్పబడు చుండు ప్రత్యయములు మొదలగునవన్నియు నీభాషలలో నొకకాలమున స్వతంత్రప్రయోగము గలిగిన ధాతువులో, శబ్దములో, లేదా వాని యవశిష్టరూపములో యయియుండునని తెలిసికొనుట కవకాశ మేర్పడ వచ్చును. సంస్కృతభాషలోగూడ నాయా ప్రత్యయము లనబడునవి అట్లే యేర్పడియుండవచ్చునుగాని, దాని పూర్వచరిత్ర నన్వేషించుచు వాని నితరములగు గ్రీక్, లాటిన్, జర్మానిక్ మొదలగు నిండో యూరపియన్ భాషారూపములతో పోల్చిచూచినప్పటికిని, అతిప్రాచీనమగు నీభాషారూపములలోగూడ నిరూఢమగు ప్రత్యయాంతస్థితియే కనబడుచుండుటచే నాయా ప్రత్యయములే స్వతంత్రపదముల యవశిష్టరూపముగా కనుగొనుట భాషాతత్త్వవేత్తలకు సాధ్యము కాలేదు. ద్రావిడభాష లట్టి స్థితి కింకను వచ్చినట్లు కనబడక పోవుటచే, నీభాషారూపముల చరిత్ర నన్వేషించినచో నందు ప్రత్యయములుగా గ్రహింపబడినవి యే మూల స్వతంత్రశబ్దముల భాగములో కొంతవరకైనను తెలిసికొనవచ్చు నని తోచుచున్నది.

ప్రస్తుతము ఆ, ఈ అనునవే మూలధాతువులైనచో వీనిపై గు, చు, ను మొదలగున వెట్లు వచ్చినవి, ఇవి యితరధాతువులపై గనబడుచున్నట్లే వీనిపైని గూడ నేదోయొక యర్థమున జేరియుండనగూడదా అను విషయము పరిశీలింపవలసియున్నది. అగు, ఇచ్చు, ఉండు అనునవి అ, ఇ, ఉ అను తొలియచ్చులకు సంబంధించినవై భాషలో మానవుని వ్యవహారమున నత్యావశ్యకములు, నతిసామాన్యములు నగు వ్యాపారములను సూచించు ధాతురూపములుగ నున్నవి. కంఠ్య తాలవ్యాచ్చులగు ఆ, ఈ లనునవే మూలధాతువులైనచో వాని నుచ్చరించునపుడు వివృతత్వమును పొందిన, అనగా తెరవబడిన (ముఖము మొదలగు) వాని కావయవములు మరల వాని యథాపూర్వస్థితిని బొందునపుడు ఆ కంఠస్థానమునగాని, తాలవ్యస్థానమునగాని శ్వాసవాయువు నిరోధింపబడి స్పర్శకలిగినచో నాయా స్థానముల కంఠ్యస్పర్శవర్ణమగు 'క' కారము, తాలవ్య స్పర్శవర్ణమగు 'చ' కారము బయలుదేరుట స్వాభావికముగదా. ఈకారణముచే 'ఆ' అనునది యుచ్చారణవశమున 'ఆకు'–'అగు' అగుటయు, 'ఈ' అనునది 'ఈచు', 'ఇచు' అగుటయు సంభావ్యమే. కావుననే 'ఆ' ధాతురూపమే అకు - అగు అనియు, 'ఈ' ధాతురూపమే ఇచు-ఇసు అనియు నూహించుట కవకాశ మేర్పడుచున్నది. ఇక 'ఉండు' ధాతురూపములలో దీర్ఘ ఊకారము కనబడుట లేదు. కావుననే 'ఊ' ధాతువుగా గ్రహింపబడలేదు. ఈభాషలలో మనకు లభించిన రూపములనుబట్టియేకదా మన మూహింపవలసినది. కావున 'ఉండు' ధాత్వర్థమునకు సంబంధించిన ఉన్తు, ఉఱు, ఉళ్ మొదలగు రూపములు కొన్ని భాషలలో కనబడుచుండుటచే వానిలో నొకటి దీని పూర్వరూపమైయుండవచ్చు నని తలపబడుచున్నది. ఈధాతువులే భాషలో నతిప్రాచీనములుగ గనబడుటచే నతిప్రాచీనకాలమున నీభాషలను వ్యవహరించినవారు వీని నితరధాతువులకు సహాయధాతువులుగ జేర్చి తమ భావములను వ్యక్తపరచికొని రని యూహింపవచ్చును. తరువాతి కాలమున నింక నితర భావభేదములను సూచించుట కితరములగు కొను, ఆడు, తెంచు, పడు, చేయు మొదలగున వనేకము లుపయోగపడినట్లు మనకు తెలియుచునేయున్నది. ఇప్పటికి మనము 'చేసికొనుము' అనుదాని రూపాంతరముగా-లేక సంగ్రహరూపముగా 'చేసికో' అనుదానిని గ్రహింపగలుగుచున్నామేగాని, మరికొంతకాలమునకు వీనికి గల పరస్పర సంబంధజ్ఞాన మంతరించుట కటస్థించినచో నప్పటి వైయాకరణుడు "'చేసి' శబ్దముమీది 'కొనుము' అనుదానికి 'కో' ఆదేశంబగు" అని సూత్రించి 'కో' అనుదాని నొక ప్రత్యయమాత్రముగ గ్రహింపవచ్చుగదా! దీనిపై విధ్యర్థమున 'వాలి' అను ప్రత్యయ మాదేశ మగుననియు చెప్పవచ్చును. ఇప్పటికే 'చేసికొనవలయును' అనుదాని వ్యావహారిక రూపమే,

లేదా రూపాంతరమే 'చేసికోవాలి' అనున దన్న భావము మరపునకువచ్చుచున్నది. వెల్లాలి-కొట్టాలి-తినాలి అనువానినిబట్టి ఇదే 'ఆలి' ప్రత్యయముకూడ కావచ్చును. కొన్నివందల యేండ్ల తరువాత నీ 'ఆలి' ప్రత్యయము కేవలవిధ్యర్థక మను భావమే నిలిచి దీని మూలస్వరూప మేమో తెలిసికొనుట సులభ సాధ్యము కాకపోవచ్చును. కాని భాషాచరిత్రకారు డీ యర్థమును భాషలో సూచించు ప్రాచీన రూపమును దొరకినంతవరకు సమకూర్చుకొని, దీని చరిత్ర నన్వేషించి అపుడు తెలుపగలడు. ఈ 'ఆలి' అను ప్రత్యయము 'ఒల్' ధాతువునుండి బయలు దేరిన రూప మగును. 'ఒల్ = to be pleased, to will, to like, to love' అనునది మూలధాతువు. దీనినుండి యేర్పడిన ఒల్లు, ఒల్లమి, ఒల్లని మొదలగురూపములు కలవు. ఈ 'ఒల్' అనునదే 'వల్' అయి, పిదప 'వలచు' ధాతువైనది. ఇది 'చేయన్' అను అన్నంత రూపముపై జేరి 'చేయన్వలయు'- చేయుటకు ఇష్టపడు, సిద్ధపడు అను నర్థము నిచ్చినది. వ్యతిరేకార్థమున 'చేయనొల్లను' అని 'ఒల్లు' ధాతువే కనబడుచున్నది. "నీవు చేయవలయును" అనునది విధ్యర్థమున వాడుకలోనికి వచ్చి కాలక్రమమున "చేయవలెను > చేయవలె > చేయాలె > చెయ్యాలె > చెయ్యాలి అను రూపముగా మారినది. ఇట్లు 'ఆలి' అనున దిప్పుడు ప్రత్యయావస్థకు వచ్చినను, దీని చరిత్ర నన్వేషింపగలిగినచో నొకకాలమున నిదియు స్వతంత్ర పదముగా నుండె ననియు, నిట్లే యీ భాషారూపము లొక కాలమున స్వతంత్రపదసంయోగముచేతనే యేర్పడిన వనియు నిర్ణయింప నవకాశ మేర్పడును గదా.

'ఈ' ధాతురూప మగు 'ఇసు' 'ఇచు' అనునది 'ఆగు' అనుదానివలెనే యితరధాతువులపై సహాయ ధాతువుగ చేర్చబడుచువచ్చె నని మనము గమనించి యున్నాము. ఈ భాషలో నీ ధాతు వింక ననేకవిధముల నుపయోగపడిన ట్లగపడుచున్నది. సంస్కృతధాతువులను స్వయంకర్తృకములుగ తెలుగు ధాతువులుగగాని, కన్నడధాతువులుగగాని చేయుటకై వానిపైని 'ఇంచు' 'ఇసు'లను చేర్చుట కలదు. కన్నడము:—ఖండిసు, చిత్రిసు, ముద్రిసు, శాసిసు, భంజిసు, రంజిసు, కోపిసు మొ. ఇట్లే తెనుగునను ఖండించు, చిత్రించు, ముద్రించు, ధ్యానించు, భుజించు మొదలగు రూపములలో నిది 'ఇంచు' అను రూపమున గానవచ్చుచున్నది. స్వయంకర్తృవివక్షయందు దేశీయధాతువులపైగూడ నిది వచ్చును. కన్న: నిట్టిసు, కంటిసు, తుట్టిసు, దల్లిసు, ఆలిసు—ఆకర్ణనే, ఓసరిసు—అపాదానే, ముక్కళిసు—గండూషే, అక్కళిసు—నిమ్నకుక్షౌ, అప్పళిసు – ఆస్ఫాలనే, ఉమ్మళిసు – చింతాయాం, కళవళిసు—మనోవైకల్యే, కినిసు-కోపే, విన్నవిసు—విజ్ఞాపనే మొ. ఇట్టి వనేకములు తెలుగునను గలవు. వీనిలోగూడ 'ఇంచు' అనునదే కనబడును. నిట్టించు, ఆలించు, ఓసరించు – ఓసరిల్లు, ప్రుక్కళించు, అక్కళించు, అప్పళించు, ఉమ్మళించు, కళవళించు, కినియు, విన్నవించు. ఇది 'విజ్ఞాపించు' అనుదాని తద్భవరూపము – కినియు, కినిసు అనునవి తెలుగుకన్నడములలోని రూపములు. ఇది తమిళమున 'చిన' అను రూపము గలదై యున్నది. అనగా 'ఇసు' చేరలేదన్నమాట. 'క' కారముమాత్రము తాలవ్యాచ్పరకమగుటచే చకారముగా మారినది. కన్నడమున 'కినిసు' అని ఇసంతముగా నున్నది తెలుగున 'కినియు' అని ఇయ్యంతముగా నుండుట విశేషము. ఈ 'ఇయు'కూడ 'ఈ'ధాతురూపమే కావచ్చును.

తెలుగునందువలెనే కన్నడమునను కొన్ని ధాతువులపైని చేరిన 'ఇసు'అనునది 'చు' గా మారినట్లు చెప్పుచు శబ్దమణిదర్పణకారు డీక్రిందిధాతువుల నుదాహరించినాడు. ఈ 'చు'వర్ణాంతరూపములు మరల ధాతువులుగనే పరిగణింపబడునట — "ధాతో రిసు ప్రత్యయస్య చాదేశే పున ర్ధాతుత్వం."

అలర్చు—వికసనే(అలర్ + ఇసు = అలరిసు > అలర్చు)

సార్చు—సమీపాగమనే (cf. తె. చేర్-చేరు + చు = చేర్చు)

అమర్చు—సంఘటీకరణే (అమర్చు)

పొణర్చు—సంయోగే (పొనర్చు)

సడిల్చు—శైథిల్యే (సడల్చు)

మరల్చు—మగుడ్చు - పరావర్తీకరణే (మరల్చు-మగుడ్చు)

కదల్చు—పృథక్కరణే (కదల్చు)

వెగడ్చు—విఖ్యాతౌ

మఱికొన్ని చువర్ణాంతధాతువులుగనే గ్రహింపబడినవి కూడ నొకకాలమున 'ఇచు - ఇసు' ధాతువుతో చేరినవే కావచ్చును.

మించు (మిన్ = ప్రకాశము + ఇసు = మినిసు - మించు.)

పించు (పిన్ = వెనక + ఇసు = పినిసు > పించు.)

పొంచు-సంకేతోద్యోగే (తె. పొంచియుండు.)

ఆఱుచు-ఉచ్చైర్ధ్వనౌ (cf. అరు + ఇసు-చు = అర్చు)

పెర్చు— విస్తారే (పెర్ + ఇసు - ఇచు = పెర్చు) > పెచ్చు - పెరుగు.

కర్చు - ఖాదనే (cf. కడి. తె.కఱచు.)

తీర్చు - నివృత్తౌ (cf తీర్, తీర్చు)

విర్చు - విభజనే (cf విడు - వీఱు - విడుచు > విచ్చు)

మెర్చు - అభ్యుపగమే (మెల్ + చు = మెచ్చు)

ఇట్లే తెలుగున నింక ననేకధాతువులు చువర్ణాంతము లీధాతుసహాయమున చేర్పడినవే యైయుండును. లేదా 'ఉండు' (> ఉళ్) ధాతువునకు సంబంధించిన 'ఉతు > ఉచు' అనుదాని మూలముననైన చేర్పడియుండును.

కుడుచు—త, క: కుడి = to drink-కుడిసు > కుడిచు < కుడుచు.

కొలుచు—త, తు, క: కొళగ = measure.

ఏడుచు—త, మ, క: అఱు = to weep, cry < ఏడు – ఏడిసు > ఏడుచు.

ఒలుచు—త: ఉరి = to strip of covering —ఉరిచు < ఒలుచు

గెలుచు—త: కెల్. క: గెల్ – గెలి = to win – గెలిచు > గెలుచు > గెల్చు

నోంచు—త: నోల్, క: నోన్ + చు = నోంచు > నోచు.

తాఁచు—క: తాకు — తాగు, తాంగు = to come in contact with-తాంకిసు > తాంకించు > తాఁచు > తాఁచు = తన్ను

తూఁచు—తూ = to weigh – తూకు – తూకిసు > తూచు.

మడుచు—త, క: – మడి = to bend, fold. మడిసు > మడుచు

తోఁచు—త: తోన్ఱు = to be visible, to appear - తోన్ఱిసు > తోంచు. తోఁచు, cf తోఁచ్ - త్రోవ.

తొలఁచు—త: తుళై = to cut a hole - తొళయిసు > తొలచు.

తొలుచు—క: తొళె = to wash, తొళసు > తొలుచు.

కరచు—త: కరై = to melt, కరగు - కరగిసు > కరగించు > కరచు

మొలుచు—త, క: మొళె = to sprout - మొళెయిచు > మొలచు.

విలుచు—త: విల్ = to buy - విలిచు > విలుచు.

చెఱుచు—త, క: కెడు = చెడు, to be spoiled (కీల్) ఇచు-చెఱచు.

పిలుచు—క: విళి = to call - విళిసు > పిలుచు.

రాచు—త: అరై = to rub-అరై - ఇచు > రాచు.

తెంచు—తెగు - ఇచు - తెగిసు - తెగించు > తెంచు.

ముంచు—త, క: ముఴు = to be immersed, ముఴుంగుఇసు > ముఴుగిసు > ముంచు.

వేచు—వేయ్ - వేగు - వేయిసు - వేచు.

కాచు—కాయ్ - కాయిసు - కాచు.

చాచు—చా - చాగు, చాగిసు > చాచు

అడచు—త: అడై - అడైసు - అడైచ్చు > అడచు

ఉంచు—త, క: ఉళ్ = to be, ఉళిసు> ఉంచు.

అలర్చు—త, క: అలర్ = to blossom - అలరిసు> అలర్చు.

ఓర్చు—త: ఓర్ = to consider, ఓర్పు - fortitude. ఓరిసు> ఓర్చు.

ఈ పైధాతువులలో, లేదా ధాతుపల్లవములలో తుదనున్న 'చు' వర్ణము ణిజర్థమును సూచించుటకుగా చేర్పబడిన ఇసు-ఇంచుధాతువునకు సంబంధించిన 'చు' కారమే యైనను, అది తొలిధాతువుతో గలిసిపోయి 'చు' వర్ణమాత్రావశిష్టమై, తచ్చువర్ణాంతరూపమును మరల ధాతువుగా, లేదా ధాతుపల్లవముగా చేయుటకు దోడ్పడినది. వీనిపై మరల ణిజర్థమును జెప్పవలసివచ్చినపుడు మాత్రము 'ఇంచు' అనుదాని సంపూర్ణరూప మగపడుచున్నది.

ఏడుచు—ఏడిపించు
తోచు—తోపించు
పిలుచు—పిలిపించు
తొలచు—తొలపించు
మొలచు—మొలపించు మొ.

ఇందలి 'చ'కారము పకారముగా మారుట గమనింపదగినది. cf రావించు-రప్పించు, ఏడుచు-ఏడుపు-ఏడిపించు, పిలుపు-పిలిపించు. ఇటీవల 'ఇంచు' ధాతుసహాయమేగాక 'చేయు' ధాతుసహాయముకూడ గ్రహింపబడుచున్నది. ఇది అన్యంతరూపముపై చేర్పబడును: గెలుచు-గెలిపించు- గెలువచేయు, మొలచు-మొలవచేయు మొ.

ఇట్లు తెలుగుకన్నడములలో 'ఇంచు', 'ఇసు' అనువానిని చేర్చుటచే ప్రేరణార్థము సూచింపబడుచుండ తమిళములోమాత్ర మట్లగుచుండుట లేదా యను ప్రశ్న బయలుదేరకమానదు. తమిళమున ధాతువుపై వి, బి, ప్పి అను వర్ణములను చేర్చుటచే ప్రేరణార్థము సూచింపబడుచున్న దని వైయాకరణులు చెప్పుచున్నారు. ఇవి కేవల మర్థము లేని వర్ణములా, ఇసు, ఇంచులతో వీనికి సంబంధ మేమైన గలదా, లేక ఇవి యేదైన మరియొక పదముయొక్క యవశిష్ట రూపములా యని పరిశీలింపవలసియున్నది. తమిళమున కొన్ని ధాతువుల ప్రేరణార్థకరూపములను బరిశీలింపగా నవి యాయాధాతువుల తుదిహల్లునకు ద్విత్వము చేయుటచేతనే యేర్పడుచున్నట్లగపడును. చూడుడు: ఆ-ఆగు-ఆక్కు; పో-పోగు-పోక్కు; ఆడు-ఆట్టు (= ఆడించు); కాణ్-కాట్టు; -ఓడు ఓట్టు; ఆలు-అల్లు మొ.

ఇదియే యీ ద్రావిడభాషలలో ణిజర్థమును సూచించుట కవలంబింపబడిన ప్రాచీనపద్ధతి యైయుండును. ఈపద్ధతి చాలదని తోచినప్పుడు ఈభాషను వ్యవహరించినవారు ఈ ధాతుసహాయమును గైకొన నారంభించియుందురు. అదియు చాల దనుకొనినప్పుడు 'చేయు' ధాతు సహాయముకూడ గైకొనబడిన దని తెలియుచునేయున్నది గదా. తెలుగు కన్నడములలో 'ఇసు' ధాతు సహాయము గైకొనబడినట్లు తెలియుచుండగా తమిళమున మాత్రము గైకొనబడియుండదా అని పరిశీలించినచో కాయ్- కాయ్చ్చు- కాయ్త్తు, అడై-అడైసు > అడైచ్చు మొదలగువానిలోని 'చు' అనునది దీనికి సంబంధించినట్లే కనబడుచున్నది. ఇది 'ఇచు-ఇచ్చు'లోని ఇకారము లోపింపగా మిగిలిన 'చు'వర్ణమే కావచ్చును. కాని వి,పి అనువర్ణములే ప్రేరణార్థకరూపములలో బహుళముగా గనబడుటను బట్టి అవి యేతదర్థసూచకములుగా గ్రహింపబడినవి. ఈ వి,పి అనునవి తెనుగునమాత్రము క్వాచిత్కముగ కనబడుటలేదా, 'వచ్చు'ధాతువునుండి ప్రేరణార్థక రూపము 'రావించు' అగునుగదా - అట్లే అగు - కావించు, చూ-చూపించు, నో-నొప్పించు, తే- తెర్ - తెప్పించు, చొరు-చొప్పించు ఇత్యాదులు. వచ్చునకు 'రా' ఆదేశమగునని చెప్పబడినను 'వర్' అనునదే ధాతువని గ్రహించినచో వర్ + ఇసు = వరిసు-వర్చు> వచ్చు అని యొక రూపము కాగా, 'ఇసు' ప్రేరణార్థకమై చేర్పబడినపుడు వర + ఇసు-వరవిసు> రావిసు = రావించు అను రూప మేర్పడుటయేగాక దీనినుండి తొలిదీర్ఘమునకు హ్రస్వము, మీది హల్లునకు ద్విత్వముకూడ కలుగుటచే 'రప్పించు' అను

రూపముకూడ కలిగినది. అట్లే ఆగు—ఆగిను—కాఇను—కావిను — కావించు, చొరు + ఇను = చొరువిను—ఉకారలోపముచే చొర్విను—రేఫవకారముల సమీకరణమువలన (Assimilation) చొప్పిను — చొప్పించు, నో—నోవ్ + ఇను = నొప్పించు, తే— తెర + ఇను= తెరవిను> తెప్పించు ఇత్యాదు లేర్పడియుండును. దీనినిబట్టి తొలుత 'వ'కారము అ + అక్, ఈ + అక్ = అవక్, ఇవక్ మొదలగు రూపములలో సంధ్యక్షరముగా (Glide Sound) బయలుదేరి తెలుగున తరువాత వర్ణవ్యత్యయము మూలముగా చేర్పడిన వాక్ - వాండు, పీండు మొదలగు రూపములలో ప్రాధాన్యము వహించినట్లే యిచ్చటను వరవిను, కావిను, నోవిను మొదలగు రూపములలో గూడ సంధ్యక్షరముగ జేరి, కొన్ని స్థలములలో బరుషాక్షరసంయోగముచే బరుషత్వమును, ద్విత్వమును బొంది ఆయారూపములలో ప్రాధాన్యము వహించుటచే వి, బి, ప్పి అనునవే కొన్ని భాషలలో ప్రేరణార్థక చిహ్నములుగా బరిగణింపబడుట తటస్థించియుండునని యూహింపదగియున్నది. ఇట్లే భాష లన్నిటిలో ఈ ధాతురూపములగు ఇను, ఇంచు అనునవి యితరధాతువులకు సహాయధాతువులుగనేగాక, అర్థభేదమును సూచించుటకుగూడ వానిపై జేర్పబడుచుండు నని నిశ్చయించుట కవకాశము కలుగుచున్నది.

'ఈ' ధాతురూపమగు 'ఇడు' అనునదే ధాతువులపై భూతకాలిక చిహ్నముగాగూడ జేర్పబడుచు వచ్చిన దని తెలుగుభాషలో నిలిచియున్న చేస్—ఇడు-ని=చేసితిని, చేసితివి, చేసితిరి మొదలగు రూపములను బట్టి నిశ్చయింపదగిన ట్లగపడుచున్నది. క్త్వార్థక ఇకార మనునది 'ఇడు'లోని డువర్ణలోపముచే మిగిలిన 'ఇ' కారమే. ఇతరదక్షిణదేశభాషలలో త: శెయిదు> శెయ్దు; క: గెయిదు > గెయ్దు మొదలగువానిలో ఇడులోని 'ఇ'కారము లోపించి దకారమే ప్రాధాన్యము వహించుటంజేసి 'ద' కారమే భూతకాలిక చిహ్నముగా తద్భాషావైయాకరణులచే గ్రహింపబడినది. మలయాళమున 'పోయి' అను నికారాంతరూపమే సంపూర్ణ క్రియారూపముగ గ్రహింపబడజొచ్చినది. అనగా 'ఇడు' లోని ఇకారమునకే ప్రాధాన్యము గలిగిన దన్నమాట.

ఈ ధాతువు మఱియొక యర్థభేదమునుగూడ సూచించుచున్న దనవచ్చును. చేయనిమ్ము, తిననిమ్ము ఇత్యాది రూపములలో నీధాతు వంగీకారమును తెలుపుట కుపయోగపడుచున్నది. "న న్నాపని చేయనిమ్ము – అనగా చేయుటకు నీ వంగీకారమును దెలుపుము" [చేయక్ = to do, ఇమ్ము = give (me permission) = let me do it] అను నర్థమున ఈ ధాతుసహాయము గైకొనబడినది. 'ఇమ్ము' అనునది 'ఈ' రూపమునుగూడ దాల్చినది. చేయనీ, తిననీ.

ఇట్లు ఆగు, ఇడు, ఉచు మొదలగు కొన్ని ధాతువులు ఇతర ధాతువులపైగాని, శబ్దములపైగాని చేర్చుట మాత్రముచేతనే వానిని భిన్నధాతువులుగ మార్చుటకు గాని, అర్థభేదమును సూచించుటకు గాని తోడ్పడుచున్న వనియు, ఇట్లే యీ దక్షిణదేశభాషారూపము లన్నియు జరిగియుండు ననియు తలచుట కవకాశ మేర్పడుచున్నది. ఈ భాషలలో 'చు' 'చ్చు' వర్ణాంత ధాతువులవలెనే ఇవి మూలధాతువులు కాక ధాతుపల్లవము లైనను ధాతువులుగనే వైయాకరణులచే వ్యవహరింపబడుచున్నవి గావున నట్లే యందము. క్కు, గ్గు, ట్టు, త్తు, ప్పు, ళ్లు, ల్లు మొదలగు ద్విత్వాక్షరము లంతమందు గల ధాతువులను విశేషముగాగలవు. కాల్డ్వెల్ పండితుడు వీనిని ధాతువులపై జేర్పబడు ప్రత్యయములుగానే గ్రహించినాడు. కాని, ఇవియు భిన్నధాతు సంయోగముచేతనో, లేదా ధాతువునందలి భిన్నవర్ణముల సమీకరణముచేతనో యేర్పడినవిగానే కనబడుచున్నవి.

ఈభాషలలో కువర్ణాంత-క్కు-వర్ణాంత ధాతువులలోని 'కు'వర్ణము 'అగు' ధాతురూపాంతరమగు 'అకు' లోని కువర్ణమే యైయుండునని యూహించితిమిగదా. కొన్నిటిలో అగు-అకు-లోని అకారము కనబడకపోవుటచే 'కు' వర్ణము మాత్రమే చేర్పబడియెనేమో యనియు దలపనగును.

ఎక్కు—ఇతర దక్షిణదేశభాషలలో 'పైకి బోవుట' అను నర్థమున ఏఱ్-ఏఱు అను ధాతువు కలదు. ఏఱు + (అ)కు> ఏఱుక్కు> ఎక్కు అను రూప మేర్ప

డినది. 'ఎక్కు' వాడుకలోనికి వచ్చుటచే గాబోలు ఏఱుధాతువు తెలుగున నంతరించినది. తమిళకన్నడముల లోమాత్ర మిది యిప్పటికిని వ్యవహారములో నున్నది. క. ఏఱు-(ప్రేర.) ఏఱిసు, దీనినుండి యేర్పడిన ఏఱ్తమ్=ఏత్తము, ఏఱ్తుమతి = ఎగుమతి మొదలగునవి యత్కించిచ్ఛేదముతో నీభాషలలో వాడుకయందున్నవి. క. ఎగరు_తె. ఎగురు(to rise up), ఎత్తు, (height) మొ.

కక్కు, క్రక్కు—త, క: కాఱ్ - ధాతువు (= to vomit). దీనినుండి వర్ణవ్యత్యయముచే 'క్రాయు' అను ధాతువు తెనుగున నేర్పడియున్నది. కాఱ్ అనుదానిపై '(అ)కు' చేరుటచే 'కాఱ్కు'> క్రక్కు> కక్కు అనురూపములు తరువాత నేర్పడినవి.

క్రుక్కు, కుక్కు = త, క: కుఱి (to make a hollow, to dig)ధాతువు. దీనినుండియే క్రొచ్చు, క్రొయ్యు అను ధాతువు లేర్పడినవి. కన్నడమున 'కు' వర్ణముతో గూడిన 'కుగ్గు' అను ధాతుపల్లవము కలదు. దీనికి క్రుంగు(to contort, to shrink)అని యర్థము. దీనినుండి యేర్పడిన సకర్మకధాతువే 'క్రుక్కు'అను నది. ఇచ్చట 'ఱ'కారము రేఫగా మారినది. క్రుక్కుట అనగా పల్లము ఏర్పడునట్లుగా జేయుట. కుక్కు అను నది పదాదిరేఫము లోపించుటచే నేర్పడిన యర్వాచీన రూపము.

చెక్కు—దీని మూలరూపము 'కెత్తు' అను నదిగా కన్నడమున గనబడుచున్నది (= to make thin, to chip, to scrape or chip off as grass). మలయాళమున 'చెత్తు' అని కలదు. దీనిపై 'కు' వర్ణము చేరిన రూపము తమిళమునకే యేర్పడినది. త: చెదుక్కు. ఇవన్నియు ప్రాచీనమగు 'కెత్తు' అను దానిలోని 'క' కారము తాలవ్యేకారపరకమగుటచే తాలవ్యచకారముగా మారుటవలన నేర్పడినవే. కకార మొక్క కన్నడరూపముననే నిలిచియున్నది. 'చెదుక్కు' అనునది తెలుగున 'చెక్కు' అయినది.

చొక్కు—క: సొర్కు = to grow intoxicated - సొర్కు> సొక్కు రేఫకకారముల సమీకరణము.

నిక్కు—నిల్ = to stand - నిల్కు> నిక్కు.

త్రొక్కు, తొక్కు—త, క: = తుళి - (= to tread upon) తుళి+(అ)కు> తొళికు> త్రొక్కు.

పొక్కు—త, క: పుఱుంగు (to be boiled, burn, blister) > పొఱుంగు> పొంగు - పొక్కు.

మ్రొక్కు—క: ముగ్గు - మొగ్గు (=to bow, to bend, an obeisance) మ్రొగ్గు, మ్రొక్కు - మొక్కు.

దక్కు—క: తంగు (=to stop, stay,etc.) దక్కు = to remain, to be preserved, to be obtained, got, to remain in one's possession.

స్రుక్కు—త, క: చురుళ్, సురుళ్ (=to contract, to shrivel, shrink), సురుగు (తె: చొరుగు. అరటి చొరుగు_a withered dry portion of a plantain leaf) సురుళ్ + కు = సురుళ్కు > స్రుక్కు.

నక్కు—త, క: నరి (=a Jackal). నరి + కళ్ =నరికళ్ > నక్కళ్ > నక్కలు. నక్క—లు. 'నక్క' అనునది ప్రాచీన బహువచనరూపమగు 'నరికళ్'అనుదాని రూపాంతరమగు 'నక్కళ్' అను దానినుండి తెలుగున బహువచనప్రత్యయముగా చేర్పడిన 'లు' అనుదానిని వేఱుపఱుపగా నేర్పడిన యేకవచనరూపము. 'నక్క'కు సహజమగు చేష్టనుండి 'నక్కు' అను క్రియారూప మేర్పడి యుండవచ్చును.

ఇక 'గ్గ' వర్ణాంతధాతువులలో పెక్కు రేఫ-గ కార సమీకరణముచే నేర్పడిన ట్లగపడుచున్నవి.

తగ్గు—తఱుగు> తర్గు> తగ్గు. క. తఱి=ఖండనే.

మగ్గు—క: మఱు = (dimness) — మఱ్గు (=to grow dim or faint, disappear, perish) > మగ్గు (=to grow pale, wither, destroyed) త: మఱిగు (=to disappear, perish) తె: మఱుగు > మఱ్గు> మ్రగ్గు> మగ్గు.

మ్రొక్కు, మ్రొగ్గు—క: ముగ్గు — మొగ్గు (to fall, fall down, to make obeisance)> మ్రొక్కు, మ్రొగ్గు. cf. ముఱి - వక్రభావే= to be bent) ముఱి+కు> మ్రొక్కు.

సెగ్గు—సెరయు—సెర + గు = సెర్గు = సెగ్గు. త, క: సెగల్ = తె: సెగడు - సెగ్గు.

ఒగ్గు—క, త: ఒలుగు, ఒలగు (=to be bent, crooked, to lie down, to fall down) > ఒగ్గు = to let fall down.

డిగ్గు—త, క: = ఇఴింగు - ఇఴి (to descend, to come down) ఇఴి + గు = డిగ్గు (వర్ణవ్యత్యయము - ఴ కారమునకు డకారము.)

నుగ్గు—నుఱు-నుఱచు - నఱుము = చూర్ణము చేయు - నుఱు + గు = నుగ్గు.

'ట్టు' వర్ణాంతములు:—

ఉట్టు—స్రవించు, కారు. త: ఉఱై (= to drop as the rain leaking) ఉఱ్ఱు > ఉట్టు? = ఉట్టు. cf తె: ఉఱియు.

ఒట్టు—కలుగు, ఉంచు, రగుల్చు. త: ఉఱు (= to be, to dwell, to touch, come in contact) > ఉఱ్ఱు > ఒఱ్ఱు > ఒట్టు (చిచ్చొట్టు)

పట్టు—త: పఱ్ఱు (= to grasp, seize, catch etc) పట్టు? > పట్టు.

పుట్టు, పట్టు—త: - పిఱ (= to be born, to arise) త, క: పెఱ్, పెఱు = to beget, generate, give birth to) పెఱు - పెఱ్ఱు - పెట్టు > పుట్టు (cf గుడ్లుపెట్టు)

తిట్టు—త, క: తిగల్ = తె: తెగడు (= to condemn) తిగల్ > తిగడు > తిగటు > తిట్టు.

తొట్టు—త: తుడంగు - తొడు, క: తుడంకు- తొడగు (= to begin, commence) తొడర్ (=to be connected, to join) తొడరు > తొట్టు? > తొట్టు.

చుట్టు—త, మ: చుఱ్ఱు > చుట్టు? > చుట్టు. క: సుత్తు = to surround, to go or turn round. చుఱె - సురుగు = what is dried and rolled up త: చురుట్టు. చుట్ట = a roll, a cheroot or igar.

మెట్టు—క: మెట్టు = చరణవిన్యాసే. to step, to tread or trample on. త, క: మిది, మిరి = to pound, tread, trample. మిదిగు - మెట్టు?

కట్టు—త, క, తు: కట్టు = to bind.

కొట్టు—త, మ, క, తు: కుట్టు = to beat, strike, pound. కుట్టు > కొట్టు.

ముట్టు—త, మ, క : ముట్టు = to dash, to touch, strike.

మిట్టు = ఎగురు—త: మిఴల్ - మేడు ; తె: మిఱ్ఱు > మిట్రు > మిట్టు. క: మిడి = to leap, bounce.

మొట్టు—క: మొట్టు = to rap the head with the knuckles of the fist. మ: మట్టు.

తట్టు—క: తట్టు = to tap, touch, strike.

మట్టు—క: మడు = to put firmly, to join closely. త: మఱ్ఱు = to be pressed.

నెట్టు—త : నెఱ్ఱు > నెట్టు? > నెట్టు = to push, dash.

ఎత్తు—త, క: ఎల్, ఏలు = (to stand up, to rise, to arise etc.) ఏల్ + ఇగు-ఇతు = ఏల్ + తు > ఎల్తు > ఎడుత్తు > ఎత్తు.

మొత్తు - మోదు > మొత్తు.

మెత్తు—త, మ : మెఴుగు = to daub a place with cow-dung, to varnish క: మెత్తు = to plaster.

అద్దు—త: అఴుంన్తు = to become pressed, to press close, press down.

బిద్దు—క: బిడ్డు > బిద్దు, త: విఴు, వీఴు = to go to ruin, to be spoiled.

దిద్దు—త: తిర్ = తిరుద్దు > తిద్దు > దిద్దు.

రుద్దు—త: ఉరై, ఉరె; క: ఉర్దు > ఉద్దు = to rub. ఉద్దు > రుద్దు.

దున్ను—త, క, మ; ఉఴు; తు: ఉడ్ = to plough, to dig up. ఉఴుందు > దున్ను.

పన్ను—త, క: పణ్ - పణ్ణు = to make ready, make, perform. ణ్ణు > న్ను.

ఎన్ను—త, క: ఎణ్ - ఎణ్ణు = to count, think, consider. ణ్ణు > న్ను cf. ఎణ్ణిక > ఎన్నిక

తన్ను—త, క: తాంకు, తాంగు = to strike, hit. తాంచు > తన్ను.

ఒప్పు— త, క: ఒల్ (ఉటు) = that is true, nice, good, to agree with. ఒల్ + పు = ఒల్పు > ఒప్పు.

ఉప్పు = ఆవిరిపోక ఉడికించు. cf. ఉబ్బు, ఉమ్మ - steam. త, క: ఉరి = to burn - to be hot ఉరిపు > ఉప్పు.

ఉబ్బు—క: ఉరుబు - ఉబ్బర > ఉబ్బు.- ఉటు = to become large. క: ఉకర = to rise, to bubble up.

కప్పు—త, మ, క: కవి = to cover, to overspread, కవి + పు = కప్పు.

తప్పు – క: తప్పు, to make a false step, to be missed, to fail. త: తవర్, తటు > తప్పు.

తిప్పు, త్రిప్పు—త, క: తిరి = to go round, revolve. తిరుగు (caus) తిరుపు-తిరుప్పు > త్రిప్పు.

మప్పు—మరగు = పరిచితమగు, ఆశపడు. మరపు > మప్పు.

విప్పు—విడు = to break, open. విడుపు > విప్పు; విడుచు > విచ్చు.

ప్రబ్బు—త, క: పర = to spread, పర్బు > పంబు, పర్బు > ప్రబ్బు.

నమ్ము—త, క: నమ్బు > నమ్ము.

గ్రొయ్య— త, క: కుటి = to become hollow, depression. కుటియ > గ్రొయ్య. cf. గ్రొచ్చిపాతెదక = త్రవ్వు.

త్రెయ్య = తెగు—క: తెఱ, తిఱ, an opening, gap, interstice.

క: తెఱయిసు = to cause an opening. తెఱయ > త్రెయ్య.

తుళ్లు—త, క: తుళంకు = to be agitated, to shake, spill as water.

మళ్లు—మరలు > మర్లు > మళ్లు-త: తుళ్లు = to leap, frisk, jump.

త్రెళ్లు—తెరలు > త్రెళ్లు. క: తెరళు = to move, stir, tremble.

వెళ్లు—వెడలు > వెళ్లు.

సళ్లు—సడలు > సళ్లు.

ఒవ్వు—త: ఉవ = to love. క: ఓ = to be attached to, to love, to be pleased with ఓవు > ఒవ్వు.

కవ్వు—క: కవి = to overspread, cover కవియు > కవ్వు.

త్రవ్వు—త, క: తుర = to bore, drill-తురవు తె: నోతువు = well made by excavating the land తురవు > త్రవ్వు.

నవ్వు—త, క: నగు, నగె = to smile, laugh- నగవు > నవ్వు.

తెలుగులోని 'డు' వర్ణాంతధాతువులు కొన్ని యితర దక్షిణదేశ భాషలలో 'ఱ' కారాంతములై యున్నవి.

ఏడు - ఏడ్చు—త, మ, క: అఱు = to cry, weep. cf తె. అడలు.

అడు(చు)—త, క: అటి = to destroy, to ruin etc.

ఈడు(చు)—త, క, మ: ఇఱు = to draw, pull.

పండు—త: పఱు = to become old, ripe. cf. పఱం = fruit - పండు.

పూడు—క, మ: పూఱ్ = to bury, to inwrap.

ఊడు—క: ఉఱి; త, మ: - ఒఱి = to abandon, to quit.

కూడు—క: కూడు - కుఱ్ఱు = to be mixed, కుఱు = crowd, multitude.

వాడు—క: బాడు > బాఱ్ = to fade, to become weary (బడలు)

తెగడు—త: తిగల్, క: తెగల్ = to rebuke, blame.

నెగడు—త: నిగల్ = to happen, to be carried on.

పొగడు—త: పుగల్, క: పొగల్ = to praise.

ఈ భాషలలోని కొన్ని నకారాంత లకారాంత ధాతువులు ఇతర భాషలలో ణకార ళకారాంతములై యున్నట్లగపడుచున్నవి.

అను—త, మ, క: అణె = to touch, to approach, to join, meet, lean upon. cf త: అణెకట్టు - తె: ఆనకట్ట.

పూను—త, క: పూణ్ = to undertake, begin, consent etc.

పేను—క: పెణె - మ: పిణి - పెణె = to entwine, twist, to tie together.

కొను—త, క: కొళ్ = to seize, lay hold of, seize, cf ఎచ్చుకోలు - పుచ్చుకోలు అను భావార్థకరూపములలో ప్రాచీనరూపము 'కొళ్' అనుదానిలోని 'ళ' కారము 'ల' కారరూపమున నిలిచియుండి కానవచ్చుచున్నది.

అను—త: 'ఎన్' to say, utter. 'ఏన్' అనుదానిలోని నకారము తమిళమునందలి పదాంతనకారమనబడు దంత్యనకారభిన్నమగు ప్రత్యేకవర్ణము.

మాను—త: మాణ్.

కను—త, క: కాణ్ = to see.

తని(యు)—త: తణి = to be appeased, satisfied. తణ్ = coolness.

తునియు—త, క: తుణ్ - తుణి = to be broken.

వేలు(చు)—క: వేల్ - హవిః ప్రదానే.
తగులు—క: తగుల్ - అనుధావనే.
పొరలు—క: పొరళ్ - లుఠనే.
చీలు—క: సీళ్ - విదారణే.
తెలి(యు)—క: తిళి - జ్ఞానే - to know.

తొలు(చు)—క: తొళె - ప్రక్షాళనే.
మొల(చు)—క: మొళె - ప్రరోహక్రియాయాం. to sprout

తెలుగున ఎకారాదిగా నున్న కొన్ని ధాతువులితరభాషలలో అకారాదులై కనబడుచున్నవి.

ఎఱుగు—త, క: అఱి = to know
ఏలు—త, క: ఆళ్ = to rule
ఏడుచు—త, క: అఴు = to cry
ఎయ్దు—క: అయ్దు = to pursue, reach
ఏరు—క: ఆరిసు = to pick out, select
తెచ్చు—త, క: తా-తర్ = to bring
నెరియు—త, క: నరై, నరె = to become grey

భిన్నధాతు సంయోగముచే ప్రాచీనకాలమున నేకాక్షరములై యేర్పడిన ధాతువులలో, తదా ధాతుపల్లవములలో రెండవవర్ణము రేఫముగా నుండుట తటస్థించినచో, దానిని వర్ణవ్యత్యయముగలిగి తొలివర్ణము రేఫసంయోగము గలదగుట తటస్థించినది.

క్రాయు—త, క: కార్-వమనే to vomit
క్రి(గా)లు—త: కీల్ (క్కాల్)
క్రుక్కు, క్రుంగు, క్రుగ్గు—క: కుగ్గు, త: కుఴి = to make hollow

క్రోలు—క: కొరల్, త: కురల్ = throat, neck.

క్రోల్చు-శబ్దించు—త: కురల్, క: కొరల్ = sound, voice. క: కొరల్చు = to call or cry out >క్రోలు.-కొసరి వసంతకాలమున కోయిల క్రోల్చిన భంగి చేర్చి నచ్చిసకహపత్రకేత్ర (కా?).

త్రిప్పు—త, క: తిరు, తిరుగు, తిరుప్పు > త్రిప్పు = to turn

త్రొక్కు—త, క: తుళి = to tread upon తుళిక్కు > త్రొక్కు.

త్రవ్వు—క, త: తురి, తురువు = to hollow, to bore. cf తె: దొరువు తురవు > త్రొవ్వు > త్రవ్వు

త్రెవ్వు, త్రెయ్యు - ఖండితమగు—క, త: తెఱవు = opening, interstice. తెఱవు > త్రెవ్వు

త్రెళ్లు—త, క: తెరళ్=to shake, tremble. తెరళు>త్రెళ్లు.

త్రోయు—త, క: తుఱు, తొఱె=to leave, to reject తొఱయు>త్రోయు.

ప్రబ్బు—త, క: పరె= to spread. పర్బు> ప్రబ్బు—పంబు.

ప్రుచ్చు—త, క: పుఱు=to get worm eaten పుఱుచు>ప్రుచ్చు. cf ప్రువ్వు.

బ్రుంగు=త, క: ముఱుగు, ముగ్గు = to sink, set immersed, to be ruined-ముఱుంగు>బ్రుంగు.

ప్రోచు—క: పొరె = పోషిసే- to nourish, protect. పొరెయిసు>పొరచు>ప్రోచు.

వ్రాయు—త: వరై-క: బరె=వ్రిలేఖిసే-వరెయు>వ్రాయు.

మ్రోగు—త: మురంగు. క: మురె=to sound as the lute. మురంగు>మ్రోగు.

మ్రొక్కు—క: ముఱుగు, మొగ్గు=to fall down, to make obeisance.

గ్రొయ్యి>గ్రొచ్చు. త: కుఴి - to make a pit. కుఴిచు>గ్రొచ్చు.

బ్రదుకు—క: బాళ్ = జీవిసే-బదుంకు> బ్రదుకు.

క్రొవ్వు—త: కొఴు=to grow fat, కొఴువు<క్రొవ్వు.

మ్రింగు—త: విఴుంగు=to swallow. విఴుంగు<మ్రింగు.


ప్రేలు—క: పేళ్=to utter, say. త, మ: పేచు—to chatter as bird.

ప్రాకు—క: పరె, పరి=to spread, extend, to spread out as creepers.

ప్రీలు—త: పిరి. క: బిరి=to burst, break.

వ్రేయు—క: బీఱు=to throw, fling to throw as an arrow or stone.

ఇట్లీయాంధ్రభాషలో ధాతువులుగా గ్రహింపబడుచున్న వాని రూపముల నితరదక్షిణదేశభాషలలోని ధాతురూపములతో బోల్చిచూచి వాని పూర్వచరిత్ర నన్వేషింప యత్నించినచో, వీనిలో పెక్కింటిని ధాతుపల్లవము లనుటయే యుక్తమనియు, వీని మూలరూపములను గనిపట్టుట కితరభాషారూపములతో బోల్చి పరిశీలించుటయేకాక, తత్తద్భాషాసంప్రదాయానుసారములను స్వరమాత్రికలు, లేదా స్వరసంప్రదాయములను (phonetic laws) బట్టి యవియే యితరపర్యాయధాతువులతో గూడి యేయేకాలముల నెట్టిమార్పులను బొందినవో తెలిసికొనుటగూడ నావశ్యకమే యనియు, నట్లు పరిశీలించిననేకాని ప్రాచీనభాషలోని మూలధాతురూపము లెట్టివో, యవి భిన్నభాషలలో నెట్లు మారుచువచ్చినవో గుర్తించుట సాధ్యము కాదనియు దెలియవచ్చుచున్నది.



అంకకాఁడు

= శ్రీ వేదము వేంకటరాయశాస్త్రి =

ఇటీవల కొందఱు పండితులకు మా తాతగారు శ్రీ వేంకటరాయశాస్త్రిగారి గ్రంథములనుండి పొరఁబాట్లను చూపుట పరిపాటి యైనది. కొందఱు పద్య రచయితలుఁగూడ నీపనికి దిగిరి. మా నెల్లూరివారైన దీపాల పిచ్చయ్యశాస్త్రిగారు చేమకూర వేంకటకవి రచించిన సారంగధర చరిత్రకు మా తాతగారు వ్రాసిన లఘు టీకను విమర్శించుచు తమకు దొరకిన క్రొత్త పాఠాంతరములతో నొక నూత్న వ్యాఖ్యను నిర్మించినారు. ఆ వ్యాఖ్యను పఠించు భాగ్య మింకను నాకు కలుగలేదు. ఈవ్యాఖ్యానోపోద్ఘాతమునందు పిచ్చయ్యశాస్త్రిగారు ఆముక్తమాల్యదా సంజీవనీ వ్యాఖ్యకూడ తప్పులతో నిండియున్నదని వ్రాసి, తాము దానికిఁగూడ వేఱువ్యాఖ్య తయారుచేయుచున్నట్లు సూచించిరి. చాలవరకు సంస్కరించియున్నట్లు వ్రాసిరి. చాల సంతోషకరమైన విషయము. తాతగారైన నేమి? భాషావిషయమున దోషముల నొప్పుకొనవలసినదే. ఇది నాయభిప్రాయము. నాకును తాతగారి ఆముక్తవ్యాఖ్యలో సందేహములు వచ్చినవి. ఒక్కొకచోట వ్యాఖ్య చాలదనియు తోఁచినది. కొన్నిట సందిగ్ధము. ఈక్రింది విషయమును చూచిన తెల్లమగును—

ఆముక్త—నాల్గవ యాశ్వాసమున రాజనీతిఘట్టములో ౨౬౩-వ పద్యమున రాజు శత్రువునెడ ప్రతిజ్ఞ చేయఁగూడదని యున్నది.

"ప్రతిన వలుకు వైరిపట్టున నృపతికి,
దండు వెడలఁ దీఱకుండుఁ దీఱుఁ;
గాక యుండియుండి కాలాంతరమున నాఁ;
గార్యకాఁడొ యంకకాఁడొ నృపుఁడు."

తాతగారి వ్యాఖ్య—

"రాజు వైరిమీఁద ప్రతిజ్ఞ చేయఁగూడదు; వైరిమీఁదికి సేనను నడుపుకొనిపోయినచో ఆకార్యము తీరినం దీఱును, తీఱకపోయినను పోవును; కాక అట్లే యుండియుండి కాలాంతరమునఁ దీఱును. అట్లు అనుకూలకాలము నెదురుచూచుట మంచిది. రాజు కార్యపరుఁడుగా నుండఁదగునేకాని కలహప్రియుఁడుగా నుండఁదగదు.

'ప్రతిన'—వై. ప్రతిజ్ఞ. 'కాలాంతరము'—అన్యమయిన కాలము- వేఱుసమయము. 'అంకకాఁడు'—(అంకము + కాఁడు) అంకము=యుద్ధము, లేక చలము; అంకకాఁడు=చలపాది.

'అఙ్కో నాటకవిచ్ఛేదే
సంఖ్యాయాం యుధి భూషణే
సమీపే రూపకే స్థానే
మన్తా వుత్సఙ్గ చిహ్నయోః'—నానా."

అని వ్యాఖ్య-నాకు తృప్తిగాలేదు. అంకకాఁడు ఎట్టివాఁడు? అంకమనఁగా యుద్ధముకదా, ఎట్టి యుద్ధము? అన్ని యుద్ధములును అంకయుద్ధములు నా? యుద్ధము చేయువారెల్ల నంకకాండ్రగుదురా? రాజు వైరిపట్టున ప్రతిజ్ఞ చేయరాదు; రాజు కార్యసాధకుఁడా, లేక అంకకాఁడా అనుటచే నంకకాఁడు కార్యసాధకుఁడు కాఁడనియు, మూర్ఖముగా ప్రతిజ్ఞ చేసి పోరాడువాఁడనియు తేలుచున్నది. కార్యము ఐనను కాకపోయినను పట్టు పట్టువాఁడనియు నర్థమగుచున్నది. మొత్తముమీఁద అంకకాఁడనఁగా జగడగొండి యని యర్థమగుచున్నది.

పాల్కురికి సోమనాథుఁడు ఈపదమును బసవపురాణములో పెక్కుచోట్ల ప్రయోగించియున్నాఁడు. సంగమేశ్వరుఁడు బసవని మూఁడవకన్నడుగు కథ (పుట ౮౫., ఆంధ్రగ్రంథమాలవారి ప్రతి.)

"చెచ్చెర మఱియు నీప్సితవస్తువితతి
నిచ్చుగా బసవఁ డిట్టిచ్చుటఁ జూచి

'కేతుకరొయ్యెదు నాకు వేడంగ'ననుచు
రూఢిగా జంగమరూపంబుఁ దాల్చి
చక్కన సంగమేశ్వరుఁడ యేతెంచి
గ్రక్కున మూఁడవ కన్నుగ్గఁ దనవ
ఆయతలింగపసాయిత హస్తుఁ
డై 'యెఱుఁగని నీకు మాయ జే' ననుచు
ముకురంబుఁ జూపుచు 'ముక్కన్ను నీవు
సకలంక సహజంబ యరె చూడు' మనిన
నద్దంబులోన ఫాలాక్షుంబుఁ గాంచి
యద్దేవదేవుండు దద్ద లజ్జించి
యప్పు డక్కడన నిరాకరమగుడుఁ
జప్పరింపుదుఁ జూచి 'వా! వంద! వంద!
ఓడకు మోడకు మోతోరి సంగ,
ఓడకు మోడకు మొకటియు నొల్ల
నెఱుఁగవే సత్యమాహేశ్వరులిండ్ల
నెఱయంకకానిని నిజగతి నన్న."

నెఱయంకకానిని=నిండు (సంపూర్ణమైన) అంక కానిని. ఇచట అంకకాఁ డనఁగా జగడగొండి, చల పాది యను నర్థము వచ్చుట లేదు. నక్త శివభక్తుఁడు, వీరమాహేశ్వరుల యిండ్లలో నెఱయంకకాఁడఁట. ఏదో సేవకుని వంటివాఁ డను నర్థము వచ్చుచున్నది.

ఆరొవ్వాతి పుటలో (౭౮)—

"అంకంబువాఁడు శివాధిసాధుండు"

అని యున్నది. అంకమునకు నిచ్చట నేమి యర్థము? ప్రభాకరశాస్త్రిగారు పీఠికలో ముద్రాధారి యని వ్రాసినారు (పీఠిక, పుట ౧౧౩). అంకమనఁగా చిహ్న మనికూడ నున్నదిగదా.

ఈప్రకరణములోనే—

"'ఇట నీవు నాస్వామి నేను' నీబంట
కఱకంఠ! యిది యేమి కళవళించెదవు
వఱల నాచేతఁ బోవచ్చునే' యనుచు
నసమాక్షుతోడ మాఱంకమై గలిచె
బసవఁ డుద్యద్భక్తి బ్రాతిమై నిట్లు"

ఇటఁగూడ శబ్దము అంకమే. మాఱు + అంక ము= ఎదురు + యుద్ధము అని యర్థము కావలయును. భక్తుఁడేమి, యుద్ధముచేయుటయేమి? కథలోను యుద్ధప్రస్తావము లేదే. పైఁగా నీభక్తుఁడు గెలిచెనఁట. నెఱయంకకాఁడు మాఱంకమై గెలిచెను. అర్థమగుట లేదు. ఈ అంకకానికి వీరమాహేశ్వరుల యిండ్లలో నేమిపని? ఏను నీబంట ననుచున్నాఁడు. కాన సేవకుఁ డగునా. ఈసేవకునియం దేదో విశేషమున్నది.

౧౧౩-వ పుటలో శంకరదాసికి ఈశ్వరుఁడు మూఁడవకన్నిచ్చిన కథ యున్నది. ఈకంటితో నీశఁడు వీక్షించి విష్ణుప్రతిమను నుగ్గుసేయును. మూఁడవ కంటితో శంకరదాసి వచ్చుట యిట్లు వర్ణింపఁబడి యున్నది—

"శంకరదాసి యచ్చటి కేఁగుదెంచి
యంకకాఁడునుబోలె హరభక్తు లలర
నతిముఖిమొగవాడ దెఱచి వీక్షింపఁ
బతియలై విష్ణుని ప్రతిమ నుగ్గగుడు"

మూఁడవ కన్ను చిహ్నముగా నుండుటచే నంక కాఁడు చిహ్నము ధరించినవాఁడు, ముద్రాధారి యని యర్థమగుచున్నది.

అంకమనఁగా వివాదము, ఆక్షేపము అను నర్థ మున నీక్రింది ప్రయోగ మున్నది. ఏణుమూర్తినైనారు కథ—

"లీలమైఁ దన ప్రాణలింగంబునకుఁ ద్రి
కాలంబునందును మేలిచందనము,
ననురక్తి నియతిగా నర్పింపుచుండ
ధనమెల్లఁ జందనంబునకు సమయుడుఁ
గడులేమి పుట్టిన గంధ మెబ్బంగి
గడియింపఁజాల కయ్యెడ నిర్ణయించి
* * *
తనువెల్లఁగూడ గంధముగాఁగఁ దిగిచి
యనురక్తి నిత్యంబు నర్పింతు నింక
నెత్తురుజిడలిన నిగ్గదేరినను
నిత్తలి తనుగుణం బింత నూపినను
* * *
మఱికదా శివునకు మాకు నంకంబు
అతిముఖిదన మిప్పు డది యేల యనుచు"

తనుగుణం బింత చూపిన నప్పుడుకదా శివునకు, మాకు వంకంబు (వివాదము) అని యేర్పడుచున్నది.

పంచమాశ్వాసమున తెలుఁగు జొమ్మయ్య కథలో (౧౬౮-వ పుట)

"సమ్మతిగావలి యుబ్బి జొమ్మయ్యమీఁదఁ
గ్రమ్మనఁ జనుదేరఁగా వేఁటకాఁడు
పడి నేల దుయ్యుడు సార పేయములు,
వడర వంకమువోలె విడిపించికొనుచుఁ
బొంగి మనోవేగమునఁ గూడ ముట్టె"

ఇచ్చట వంకమనఁగా నేమర్థము? యుద్ధమువలె విడిపించుకొనుటయుఁగాదు, ముద్రయుఁగాదు- ఏదో సాములగువులవలె నున్నది.

షష్ఠాశ్వాసమున ఏకాంతరామయ్యకథలో వంకయ్యకథయందు వంకయ్య తలకోసికొనఁగా అది మొలవఁగా పలుమార్లు తలకోసికొనఁగా తుదకు శివుఁడు ప్రత్యక్షుఁడై—

"మారారి విస్మయమానకుండగుచు
'ఓకోరి వంక నాకూరుపు వోదు
ఓడితినన్ను నే డెదు వోదువఁ
బాడిరే నీ వీరభక్తికి నిలువ
నావశం బే?' యని దేవదేవుండు
నావంకతంబె శ్రీహస్తంబు పట్టి
యనురాగమునఁ బొల్పు వత్తల లెల్లఁ
దన లింగమూర్తిలోనన ధరియించె
శంకించుచును వరు ల్సంస్తుతిసేయ
వంకయ్య శివుని మాఱంకమై గెలిచె"

ఇచ్చట శివుఁడు తా నోడితి ననుటచేతను, వంకయ్యది వీరభక్తి యనుటచేతను, వంకయ్య శివుని దర్శించుటకు ప్రతినపట్టి గెలిచినందునను అతఁడు అంకకాఁడును, చేసినది అంకమును, శివునితో(ప్రతిస్పర్ధించి) మాటు చేసినందున మాఱంకమునుగా స్ఫురించుచున్నది.

అంకకాని చేష్టలు కొన్ని కనఁబడుచున్నవి. అంకకాఁడు కచ్చించుకొనును. ఏకాంతరామయ్య జైనుల నోడించిన సందర్భమున

"బసవఁడు సహితంబు భక్తనికాయ
మెసకంబుతోఁ గొలువిచ్చి కూర్చుండ
నాబిజ్జలుఁడు దంత్రి మప్పురాంతరము
నాబాలవృద్ధాదు లంతంతఁ జూడ
నచ్చెరువంద నేకాంతరామయ్య
కచ్చించికొని యంకకాఁడునుఁబోలె
దరహాసకాంతి వక్త్రమునఁ దుల్కాడ-"

ఇది అంకకాఁడు రంగమున చేయు చర్యఁగా నున్నది.

అంకమున కేఁగువాఁడు అర్పుబొబ్బలతో నేఁగును. బిబ్బబాచయ్యగారి కథలో బాచయ్యగారు భక్తుల ఎంగిలి కూకులను ప్రసాదమని బండ్లలో నిడి అట్టహాసముతో గొబ్బూరు ప్రవేశింపఁగా నచటి బ్రాహ్మణులు—

"......హో! నిలుఁ డెందు వచ్చెదరు
మీ తెలుంగిది యేమి మిగిలియున్న దియు
పెండ్లికేఁగుటో యిట్లు బండ్లిది యేమి
దండ్లువచ్చెకో మీఁదఁ దల్లడం బేల
యంకాన కేఁగెద రార్పుబొబ్బలను."

మొత్తముమీఁద నీయుద్ధారములవలన తేలిన దేమనఁగా-అంకమనఁగా నొకతెగ యుద్ధము, ఒక వివాదము; అందు వివాదకుఁడైన యంకకాఁడు వైరిపై ప్రతినపట్టి జగడమాడును; ఓడినను గెలిచినను లెక్కలేదు. ఈతఁడు గొప్పవారి యిండ్లలో నుండును; ఏమి కొలువో తెలియదు. ఇతని కేదో గుర్తున్నది. బహుశః యజమానుని బాంధవము గావలయు. పైఁగా నీయంకకాఁడు అంకమున ఎదిరిదెబ్బ తగులక లాఘవమున విడిపించుకొనుటచేత సాములు నేర్చియుండవలయును. కయ్యమునకు దిగుటకు ముందును, రంగమునందును బిభీషికలం జేయును. సాధారణముగా ఈఅంకకాండ్రకు గెలుపే హెచ్చుగా కనఁబడుచున్నది. ఏలన, కనఁబడిన రెండు సందర్భములందును భక్తులు 'అసమాస్త్రితోడ మాఱంకమై గెలిచి' యున్నారు. (ఈ రెండుసందర్భములను వీరు భగవంతుని పొందు గోరి అంకమొనర్చిరేకాని వైర మపేక్షించికారు.)

కాని కృష్ణరాయలవారు గెలుపు సందేహ మనుచున్నారు. నిజమేగదా.

అంకకానినిగురించి యింత వ్రాయవలసి యుండఁగా మాతాతగారు (వేంకటరాయశాస్త్రిగారు) టూకీగా "అంకకాఁ డనఁగా చలపాది" యనిమాత్రము వ్రాసినా రేల? ఈవ్యాఖ్య సాధువా? ఇందుల కింక నేదేని సమాధానము కలదా? అంకమనఁగా నేమిరెూ, అంకయుద్ధ మనఁగా నెట్టిదో, అంకకాఁ డేల గొప్పవారి యింట్లయం దుండవలయును, అచట నుండి అతఁడేమి చేయును, అతఁ డేల కార్యకాఁడు గాఁడు- మొదలైన విషయములు ఈవ్యాఖ్యచే తేలలేదు. ఇట్టి విషయముల నెల్ల శ్రీదీపాలపిచ్చయ్యశాస్త్రిగా రిదివఱకే కనుగొన్నారో, లేక ముమ్ముందు 'రిసర్చి' చేసి ప్రకటింతురో తెలియవలసియున్నది. మొత్తముమీఁద నీవిషయమున వేంకటరాయశాస్త్రులవారి వ్యాఖ్య తృప్తికరము కాదని నాయభిప్రాయము. శ్రీ పిచ్చయ్యశాస్త్రిగారు నాతో నేకీభవింతురో, లేదో చూడవలసియున్నది.

రచయిత అయ్యే చదువరి

= 'పావ' =

నాకు చిన్నతనంనించీ విరివిగా చదవడం అలవాటు. అంతే కాదు. నావిషయంలో చదవడం ఒక వ్యసనంగాకూడా అయిపోయింది. నాచిన్నతనంలో బాహ్యేంద్రియాలను అంతర్ముఖం చేసుకుని పుస్తకవాతావరణంలో మునిగిపోయినప్పుడు, "చదువరీ, ఏ మా వనసౌందర్యము" అనీ, "పాఠకమహాశయా, మనము ఇప్పుడీ భూతగృహములోనికి ప్రవేశింతము" అనీ, "Gentle reader! Now you would like to have a look at our hero" అనీ చదువుతుంటే, ఎంతో సరదాగా వుండేది. ఎవరో ఆప్తు డయిన అవ్యక్తవ్యక్తి నా చెయ్యి పట్టుకుని, చనువుతో, ఆదరంతో నేను చూడని లోకా లెన్నో చూపిస్తున్నట్లు నాకు అనిపించేది. "ఎవ్వ డా క్రూరకర్ము డెవడు?" అన్నవి తెల్లకాగితంమీద నల్లని అక్షరాలే అయినా, అవి చదువుకునేటప్పుడు కనబడని ఎవరిమీదో నేను కూడా కోప్పడేవాడిని. "ప్రేయసీ, సుఖస్వప్న దరిద్రమైన బ్రతుకు నాది, నిద్దురపోవు వల్లకాదు" అని చదువుకుని, అకారణంగా నా బ్రతుకంతాకూడా వల్లకా డయిపోయినట్లు బాధపడేవాడిని. కాని అదంతా నిజంగా కోపమూ కాదు, బాధా కాదు. సరిగ్గా నా మనస్సులో అనుకుంటో ఉన్నదే, నా గొంతులో ఆడుతో ఉన్నదే ఎవరో చటుకుని రాసేసి ఊరుకున్నారని ఆందోళన. నాకు నచ్చిన రచన ఏది చదివినా అల్లాగే అనిపించేది. ఏరచన చదివినా నాకు అతి సులభంగా కనబడుతుంది. అపదాలన్నీ నే నెరిగున్నవే. వాటి ఔచిత్యం, ధ్వని నాకు పూర్తిగా వంటపట్టే ఉంటాయి. ఆ భావాలు నా హృదయానికి కొత్తవి కావు. ఈ రచనలన్నీ నేను రాయకుండా ఇం కెవరో రాసెయ్యడం, ఏదో విధివేళాకోళంలాగ నాకు అనిపించేది. ప్రయత్నిస్తే అల్లాంటివి నేనుమాత్రం ఎందుకు రాయలేను ? కాని ప్రయత్నం అసలు ఎక్కడ మొదలుపెట్టాలో తోచక నా రచనా కుతూహలం మొదట్లోనే ఆగిపోయేది. నా హృదయంలో అనేక భావాలు నిండి ఉన్నట్టు అనిపించేది. కాని ఒక్క భావంకూడా సాహసించి పైకి తొంగిచూసేది కాదు. నాకు తెలిసిన పదజాలంలోనించి ఒక్కమాట అయినా కూడా జ్ఞాపకం వచ్చేది కాదు. అంచేత కష్టమంతా మొదలుపెట్టడంలోనే ఉందనీ, ఒక్కసారి మొదలు పెట్టగలిగితే ఇంక నదీప్రవాహంలాగ నిరంతరంగా రచన సాగిపోతుం దనీ ఊహించుకునేవాడిని. రచయి

తను ఈ మొదలుపెట్టగలిగిన మాత్ర మేదో తెలుసును, నాకు తెలియదు. నాకూ, అతనికీ అంతే తేడా

రచయిత అంటే నాకు ఒక పక్కని ఈర్ష్యే, ఒకపక్కని గౌరవం కూడాను. ఏపత్రిక విప్పినాసరే పెద్ద అచ్చులో ఒక శీర్షిక, దానిపక్కని కొంచెం చిన్న అచ్చులో రచయిత పేరు. ఏపుస్తకం చూసినా, అట్టమీదో, లేకపోతే తరవాత పుటమీదో, ఏమీ ఎరగనట్టు నటించే అమాయకమయిన ఒక పేరు. ప్రతి చదువరీ శీర్షిక చదివినా చదువకపోయినా, రచయిత పేరు చదువుతాడు. అది కనబడకపోతే వెతుక్కుంటాడు. రచయిత పేరులేని ఏరచన అయినా కనబడితే, చదువరి వెతికివెతికి కొంచెం చిన్నపుచ్చుకుంటాడు ఎవరో తనని మోసగిస్తున్నట్లు అతనికి దిగులుకూడా కలుగుతుంది. తన పరపతిని గురించి పూర్తిగా ఎరిగున్న పొగరుతో రచయిత తనపేరు చిన్న అక్షరాలతో అచ్చువేయించుకుంటాడు. ఒక్కొక్కప్పుడు ఇంకా గమ్మత్తుచెయ్యడానికి రెండుమూడు అక్షరాల మారుపేరు ఏదో పెట్టుకుంటాడుకూడాను. ఒక్కొక్క అమాయికుడయిన రచయితమాత్రం తన బొమ్మనికూడా రచనపక్కని అచ్చువేయించుకోడం లేకపోలేదు. అటువంటి రచయిత అంటే నాకు జాలి. ఎంచేతనో అతను నా అభిరుచికి చులకనయిపోతాడు. రచయిత అంటే నాభావనలో ఒక అలౌకికవ్యక్తి—రచయితలయిన ప్రత్యేకవ్యక్తుల్ని గురించి నేను మాట్లాడడంలేదు. వారంతా నాలాగే కాఫీ తాగుతారు, భోజనం చేస్తారు, సిగరెట్లు తాగుతారు, నిద్ర పోతారు. నాభావనలోని రచయితమాత్రం ఈలోకపు నియమాలను అనుసరించనక్కరలేదు. అత డూరికే గాలిలా వ్యాపించగలడు. ఒకేసారి అనేకవస్తువులను చూడగలడు. ఒకేసారి అనేకచోట్ల ఉండగలడు. అతని దేహం ఒక పెద్ద ఆయతనం. ఒక పెద్ద కర్మాగారం. అందులో ఊరికే సృష్టి జరుగుతో ఉంటుంది. ముద్రాయంత్రంలోనించి పేపర్లు మడతపెట్టి ఇవతల పడ్డట్లుగానే, ఆకర్మాగారంలోనించి పద్యాలు, కథలు, నవలలు, నాటకాలు, కావ్యాలు తయారయి ఇవతల పడుతూంటాయి. ఆకర్మాగారాన్ని రహస్యంగా ప్రవేశించి నేనుకూడా ఒక్కసారిగా రచయిత నయిపోవాలని నాకు ఎంతో కుతూహలం. గోపాయిచిటికలాంటి మాత్రం ఏదో అక్కడ తప్పకుండా దొరుకుతుందని నా ఆశయం. ఆరహస్యం కాస్తా చేతపుచ్చుకుంటే ఇంక అనంతంగా రచనలు తయారుచెయ్యవచ్చును. పత్రికలలోనూ, పుస్తకాలమీదా నాపేరు స్వేచ్ఛావిహారం చేస్తుంది. నేనే రచయితనయితే ఎంత దర్జాగా ఉంటుంది! ఎంతమంది నాపేరుకోసం పత్రికలూ, పుస్తకాలూ వెతుక్కుంటారు! నేను సభలకి వెడితే ఎంతమంది నన్ను గౌరవాశ్చర్యాలతో చూస్తూ నిలబడిపోతారు!

నవీన మానసిక శాస్త్రజ్ఞులు చెపుతున్నట్టు మనలో వ్యక్తంగానో, అవ్యక్తంగానో దాగివున్న కోరికలు కలలో సాఫల్యం పొందుతాయిగావును. ఇది కల అనుకోండి, లేకపోతే నామెలకువలోనే నడిచివెళ్లిన ఒక ఊహ అనుకోండి. నేను రచయితదేహాయతనంలోకి కామరూపం ధరించి ప్రవేశించాను. నా కీపరకాయప్రవేశం ఎల్లా చేతనయిందని అడక్కండి. అదికూడా కలలో భాగమే. ప్రవేశించినతరవాత నేను చూసినవీ, అనుభవించినవీ విశేషాలు వర్ణిస్తాను. నాకు ఎటు చూసినా లెక్కలేనన్ని ఏవో అర లున్నాయి. ఒక్కొక్క అరలో ఒక్కొక్క విచిత్రం. ఏవేపుకి చూస్తే, ఆవేపుఅరలోనించి ఏవో ముందుకి తోసుకువచ్చి తొంగిచూస్తాయి. ఇంక ఆ అరలలో సామగ్రి: సగంసగంవాక్యాలు—కొన్ని కల్పించినవి, కొన్ని ఎప్పుడెప్పుడో చదివిన రచనలలోవి. కొన్ని విడిపదాలు—కాని ప్రతిఅరలోను, ఆపదానికి ఒక విలక్షణమయిన ధ్వని ఉంది. కొన్ని ప్రకృతిచిత్రాలు — కాని కేవలం ప్రకృతికి ప్రతిబింబాలు కావు. వాటిలో చిత్రమయిన ఏరుకోడం ఉంది. వాటిలో అన్ని భాగాలనూ మనం నిర్ణయించలేని మాత్రం ఏదో ఒకటిగా కూరుస్తోంది. కొన్ని సగంసగం ఊహలు, కొన్ని సంఘటనలు, కొన్ని పాత్రలు—వాళ్ల ప్రత్యేకవైలక్షణ్యాలతో సగంసగం తయారవుతున్న కథాఘట్టాలు, సగం కూర్చిన పద్యభాగాలు — వీటికి అంతులేదు. నాకు ఆశ్చర్యం, దిగ్భ్రమకూడా కలిగాయి. నాచదువరి వ్యక్తిని నేను సంపూర్ణంగా మరచిపోయాను. చటుకుని నాచైతన్యం దృఢపడింది. అమితసాహసంతో, చనువుతో నేను పర్యాలోకన చేశాను. నాచైతన్యం కదిలింది. ఎప్పటిదో

ఏదో ఘట్టం నాకు చటుకుని జ్ఞాపకంవచ్చింది. ఏదో మరుపులోనించి జ్ఞప్తికివస్తూవున్నట్టు చుట్టూ చూశాను. మెరుపుతీగలాగ ఒక అరలోనించి ఒకమాట ముందుకి తోసుకువచ్చింది. ఆపదంవెనక ఒక ప్రకృతిచిత్రం, ఒక భావన, ఒక అనురాగం విచిత్రంగా పర్చుకు పోయాయి. ఒకదానివెనక ఒకటిగా పదాలు మెరుపుతీగలలాగ మెరిశాయి. వాక్యాలు పూర్తిఅయాయి. పద్యాలు తయారయాయి. కథరూపం దాలుస్తోంది. నామనస్సు ఆశ్చర్యంతో ఊరికే పక్కని నిలబడి అన్నిటినీ మననం చేసుకుంటోంది. నాచేతులు వ్రాత మొదలుపెట్టాయి. నాశక్తిని చూసుకుంటే నాకే ఆశ్చర్యంవేసింది. అనేక పెద్ద ఉద్వేగం, చైతన్యం; హిమాలయశిఖరంలాగ ఊరికే పైకి లేచిపోతోంది. ప్రతిపదం ధగధగ మెరిసి తన ఔచిత్యం ధ్రువపరచుకుంటోంది. అంతవేగంలో నాకూడా నాలో చదువరి ఒకప్రక్కని ఒదిగి ఆనందిస్తోనేవున్నాడు. నావ్రాతకి కాగితాలు చాలలేదు. క్రొత్తకాగితాలకోసం చేతులు జాచేసరికి గోడతగిలి మెలకువ వచ్చింది. కల కరిగిపోయింది. పేకల మేడలాగ కలలోని హిమాలయ శిఖరాలు నేలమట్టం అయిపోయాయి. ఎండకి పొగమంచు విడిపోయినట్టు ఊహలు, చిత్రాలు శూన్యంలోకి మాయమయిపోయాయి. నేను నిస్పృహతో కదలకుండా పడుకున్నాను. జరిగిన దంతా పర్యాలోచన చేసుకున్నాను. కల కరిగిపోయినా కలలో కావ్యం వ్రాసినప్పటి సంతృప్తి కొంత మనస్సుని పట్టుకుని ఉండిపోయింది. ఆలోచించుకోగా ఆలోచించుకోగా, ఆఅరలన్నీ నాలోకూడా ఉన్నట్లు తట్టింది. ఆపదాలున్నాయి, ఆచిత్రాలున్నాయి, సగంసగం ఊహలున్నాయి, ఘట్టాలున్నాయి. ఇవన్నీ ప్రతిమనిషిలోనూ ఉంటాయనికూడా తట్టింది. అయితే రచయితలోని ప్రత్యేకత ఏమిటి? రచనలో ఇమిడి ఉండే వైలక్షణ్యం ఏమిటి?

ప్రొఫెసర్ హుమయూన్ కబీర్ చెప్పినట్టు ప్రతిరచనా ఒక్కొక్క మొనడ్ వంటిదేమో. మొనడ్ అంటే పైకి అతినిరాడంబరంగానూ, లోపల అతి క్లిష్టంగానూ ఉంటుందట. అది కిటికీలు, తలుపులు లేని ఒక ఊహాపదార్థంట. ఈసందర్భంలో నామిత్రుడొకడు హాస్యానికి అన్నమాట ఒకటి జ్ఞాపకం వస్తోంది. మొనడ్ నిగురించి తెలుసుకుంటే, పైకి నున్నగా ఉన్న ఒక రబ్బరుబంతీ, లోపల కనబడకుండా మెదిలే ఒక జెర్రిపిల్లలాగ కనబడుతుంది అన్నాడు. నామిత్రుడు హాస్యానికి అల్లా అన్నా, అతని హాస్యం కవనవిషయాల్లో సరిపోతుం దనుకుంటాను. ప్రతిరచనా పైకి అతితేలికగా, అతిసులువుగా కనబడుతుంది. కాని అందులో ఏదో కనబడని జెర్రిపిల్లకూడా కదులుతూనే ఉంటుంది. అసలు జెర్రిపిల్లలా కదిలే అనుగుణం లేకపోతే రచనకి విలువలేదు. అయితే వెనకటికి బూరెలు తిన్న ఒక దొరగారికి వచ్చిన అనుమానమే నాకూ వచ్చింది. పైనంతా నున్నగా తయారయిన రబ్బరుబంతిలోకి జెర్రిపిల్ల సెల్లాగ ఎక్కించడం? ఏమాట కామాట విడదీస్తే రచనలో ఆకదలిక ఏమీ కనబడదు. కాని ఆమాటలన్నీ కలిసేసరికి జెర్రిపిల్లకదలిక ఎక్కడినించి వస్తోంది? అదే రచయితయొక్క గోపాయిచిటిక.

మళ్లీ నేను వెనకటి కలజ్ఞప్తికి తెచ్చుకున్నాను. నేను రచయితగా మారిన ఆక్షణం అదేపనిగా తలుచుకున్నాను. ఆ ఉద్వేగం మనస్సుకి పట్టించుకున్నాను. నాకు చటుకుని, మెరుపుతీగవేగంతో తట్టింది—అంతా మార్పులతో ఉంది. ఒకపదంతరవాత ఒకపదం అతకడంలో ఉంది. ఒకచిత్రంతరవాత ఒకచిత్రం పేర్చడంలో ఉంది. రచన అంటే అంతే. నేను ప్రకృతిలో అనేకదృశ్యాలు చూస్తాను. కాని అన్నీ నేను జ్ఞాపకం ఉంచుకోను. ఒక్కొక్కప్పుడు నేను చూసినదంతా ఒక పదంలోకి ఇమిడిపోతుంది. ఒక్కొక్కప్పుడు రెండు ప్రకృతిచిత్రాలు ఒకదానిప్రక్కని ఒకటి పెట్టేసరికి అవ్యక్తమయిన కదలిక రెంటిమధ్య ఏర్పడుతుంది. ఈ అనుసంధానం, ఈమార్పు—ఇదే రచయితయొక్క రహస్యం. తక్కిన విషయాల్లో అతనూ, నేనూ ఒకటే.

తరవాత నేను అనేకపుస్తకాలు చదివాను. అనేకసార్లు ప్రయత్నించాను. కాని ఆపదాలుకూర్చడం నాచేత కాలేదు. ఇతరులు కూర్చిన రచనల నెన్నిటినో విశ్లేషించి చూశాను. ఎంత చేసినా రచన నాకు చేతకావడంలేదు. ఆనాటికీ, ఈనాటికీ నేను కలలో వ్రాసిన ఆకావ్యం ఒక్కటే ఉత్కృష్టమయినది. నేను రాసిన రచనలన్నీ ఆ ఆదర్శాన్ని చేరుకోడానికే ప్రయత్నిస్తున్నాయి. నాకలలో కావ్యాన్ని పోలిన రచన ఒకటైనా నేనింతవరకూ చూడలేదు. కాని అందులో ఒక్కఅక్షరంకూడా నాకు జ్ఞాపకంలేదు.

[ఆలిండియా - రేడియో మద్రాసు కేంద్రంవారి అనుమతిని.]

ఆత్మానుభవము

= శ్రీ వేదాల తిరువేంగళాచార్యులు =

పగిలిపోయిన దీగాలిపటము మధ్య - చిరిగిపోయిన వంచులు విరిగిపోయె
నడుమనున్నట్టి బద్దయు నాది భ్రాంతి - పగులదు చిరుగదు విరుగదు గద తండ్రి!

పనికిరా దాటకని దీని బారవేయ - దలతునేగాని యంతలో దలపులోన
మధురమధురమ్ములౌ స్మృతిమధువులు తమ - యంత పైకుబ్బి త్రాడులై యాట కేమ.

అది కృతజ్ఞతయా? యింక నందువలన - సుఖ మనుభవింపగోర్కెయా? సుందరమని
భ్రాంతియా? మలినమలినాలు ప్రాతవడ్డ - పేలికలెకద యది తండ్రి! ప్రేమయేల?

> ఓయి మహాకవీ! తలపు లొప్పెనె? నీ కిటు లెంతకాలమై
> పోయెనొ ఖండగీతికలు ప్రోగులుపోసి, విషాదగీతికల్
> హాయినొనర్చునా? అనెదవా? యెటులైనను నీదు కావ్యమం
> తా యిటువంటిదేకద! తుదాముద లున్నది యున్నదేకదా!

> మనసున లేక, నేర్చిన సుమాళమునన్ జెయి కాలు ద్రిప్పుచుం
> టిని కనులందు భావ మెటు నిల్వగనేర్చు? రసమ్ము మోములో
> ననువగు టెట్లు తండ్రి? యికనైనను దన్మయతానుభూతి జో
> స్పను బ్రయత్నించెదో? విరసనాటకమున్ విరమింప నెంచెదో?

తన్మయత నొందు సామగ్రి దయచేయుమి - ఈవిపంచిని తంత్రులు నావి కావు!
గట్టిగా కోణమున దాకగల్గెనేని - తెగును తీగెలు శూన్యమే మిగులు తండ్రి!

ఇది విరహమో? వియోగమో? యేదో? దీని - నర్థమొనరించుకొనువారలైన లేరు!
ఆవిషాదమునందు సహానుభూతి - యొక్క కన్నీటిచుక్కైన దక్కబోదు.

> ఏరిని దోడుపంపితివొ ఈనటనమ్మున వారలెవ్వ రు
> న్నా రిటు రారు వార లొకనాటికి, వత్తురుగాక శుష్కసం
> సారము చేయజాలను విషాదము నేను భరింపజాల గ
> న్నార గనుంగొనంగలిగిన న్నిటు లూరకయుంట యిష్టమా?
> ఈరసహీననృత్యమున కెందుకు నెట్టెదవయ్య తండ్రి! న
> న్నీరసమా? మనస్సునను యేత్తును చెప్పకొనంగ నెవ్వ రు

న్నారిక కన్నతండ్రి కరుణన్ విడ గంచెము చేను మేయగ
న్నారము. మాటయున్ బిగులునా? వలవంతల మున్గియుండగా.

శోకమున్న నె మాటలు శూన్యమనుచు-"నచ మునే శ్లోక ఇతితు మంతవ్య"మనిమె*
కాని నాయనుభవమ్మున గాదుతండ్రి - "కవికి తన్మయతానుభూతి గలుగవలదె".

శోకమున్న నె మాటలు శూన్యమనిన - శోకభర మున్న నాగతి చోద్యమయ్యె
వేలకొలదిగ మాటలు, వింతవింత - లూహలును బయలు దేరెడు నోయితండ్రి!

లేని దుఃఖమ్ము నొకటి కల్పించుకొనిరి - భావనాహీనమగు కవిత్వమ్ము జెప్పిరి
అది యభావకవిత్వమ్మె యగునుగాని - భావతన్మయతమె లేక భావకవియె...

నీవు దుఃఖమ్ము వారింపరావుగాక - నే ననుభవించు దుఃఖమ్ము నీకెఱుకయె
ఆత్మలో నాత్మమై యుంటివి అట్టిదయ్యు - నావిషాదమ్ము గుర్తింపబోవ దామె.

మీార లికపురలో గొంత మేలు నీవు - ప్రాణమున ప్రాణమయ్యు నీవార్తి కలుగ
జేయబూనవు, దుఃఖంపు చిచ్చు కొలిపి - హాయిగా నవ్వుచుండుట నవల గనెద.

తమ దుఃఖమ్ముల శోకము న్వినుచు పెద్దల్ పూర్వ మేవేవి సౌ
ఖ్యములన్ బొందిరొ వానిన్ బనవి "యయ్యయ్యో! యవే పోయె" నం
చు మరీ యేడ్తురు, నాది కాదటుల, నీచూచాయలం దేది సౌ
ఖ్యము నా కెన్నడు వెన్క కాలమున? ముందా పూజ్యమానేకదా!

కవులు విమర్శకుల్ కరుణకావ్యములందునగూడ హర్షమే
యవు ననుభూతి యందురు, అది యంతయు నాయనుభూతి దల్లక్రిం
దవును, మదీయదుఃఖమున హర్షము లేశము లేదు మోదహే
తువులను గూడ దోచెడిని దుఃఖమె మిక్కిలి. ఏమిచిత్రమో?

విభ్రమమొ భ్రమమొ నాదు వివేకసీమ - నాక్రమించెను జయము ప్రేయసిదొ? నాదొ?
ఎవరి జయమైన నాదుఃఖ మినుమడించు - తరుగుదల లేదు దిగులున దరుగుదలమె.

కష్టసుఖములు కావడి కడవలట ని - జమ్మె! నాతల నుండు కష్టమ్మువలన
కనుల నీ రది కాల్వలు కట్టు సుఖపు - గడవ బగులుట తలకు రాగలిగె నిదియు.

---

* "మునికిదుఃఖమ్ములేదుసుమ్మ"నియె నొకడు.

కలగూరగంప

పక్షుల పాఠశాల

[పిట్టకథ]

పూర్వం ఒకానొకప్పుడు పక్షులన్నీ చేరి, తమ తమ కులవిద్యలు నియమానుసారంగా నేర్చుకొనవలెననే అభిప్రాయంతో ఒక పాఠశాలను ఏర్పరచుకొన్నాయి. పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడుగా సకలవిద్యాపారంగతుడైన పక్షిరాజు గరుడుణ్ణి ఏర్పాటు చేసుకొన్నాయి. బడి ప్రారంభమయింది. సిలబసు ప్రకారంగా పాఠాలు జరుగుతున్నాయి. గరుడాచార్యులవారు కూడా శిష్యులందరిమీదా ఒకేసమానమైన విశ్వాసంతో, నిష్పక్షపాతంగా పాఠాలు నేర్పుతూ అందరి ఆదరాభిమానాలనూ సంపాదించుకొంటూ వున్నారు. బడి నిర్విఘ్నంగా సాగిపోతున్నది.

కొన్నాళ్లు గడచినవి. ఒకనాడు శ్రీ మహావిష్ణువు ఎందుకో వచ్చినట్లు వచ్చి, గరుడుని నిష్పక్షపాత స్వభావాన్నీ, సాహసవిక్రమాలనూ చూచి, మెచ్చి, అతనైతే తనకు నమ్మినబంటుగా సరిపోతాడని నమ్మి, మెల్లగా చేరి గరుడునికి అవీ ఇవీ చెప్పి తనకు అది మొదలుకొని వాహనంగా ఉండేటట్లు అతని నొప్పించి, వెంటనే అపాయింటుమెంటు ఆర్డరు పడవేసిపోయెను. శ్రీ మహావిష్ణువుకొలువంటే మాటలా? పొద్దస్తమానమూ అతని సన్నిధానంలోనే ఉండవలసిన పని! క్షణకాలం తీరుబాటు ఉండదు. వేయిండ్లపూజారి విష్ణువు ఏక్షణాన ఏచోటికి వెళ్లవలసి వస్తుందో! ఈపరిస్థితిలో గరుడాచార్యులకు బడిపంతులుగా ఉండి పాఠాలు చెప్పడానికి పురసత్తేదీ! కొత్తకొలువులోనే ఆయన పరిపుచ్చుకొన్నాడు.

ఇంక ఆబడిపాట్లు చూచుకోండి—మేష్టరుగారు లేకపోయేటప్పటికి బడిలో గోలోగోల! అడిగేదిక్కు లేకపోయేసరికి, అడ్డమైన గోలా బయలుదేరుతుంది! బడిలో అరాచకం ఏర్పడింది. చదువుసంధ్యలు చల్లబడిపోయినాయి. "ఎవరికి వారే యమునాతీరే" అన్నట్లు ఎవరిదారి వారిదైపోయింది. బడిఅంతా అల్లకల్లోలమైపోయింది.

సోమారిపోతు కోకిల పొద్దస్తమానమూ పాటలు పాడుకొంటూ పరాకుగానే పొద్దు గడపజొచ్చింది. గుడ్లుపెట్టడమూ, వాటిని పొదగడమూ, గూళ్లు కట్టుకోవడమూ, పిల్లల పోషణా మొదలైన కులవిద్యలు నేర్చుకోవడమే మానివేసింది.

జంభాలరాయుడు నెమిలి తనకంటె అందగాడు 'నభూతో, న భవిష్యతి' అని విర్రవీగుతూ లగ్గలకెగిరే లకువులే నేర్చుకోలేదు.

ఈరీతిగా అందరి చదువులూ సన్నగిల్లిపోయినాయి. బడిలో తగవులు బయలుదేరినాయి.

ఇలా అయితే వల్లకాదని, తిరిగీ అన్నీ చేరి ఇంకొక మేష్టరును ఎన్నుకోవాలని నిశ్చయించుకొన్నాయి. కొన్ని రోజులు తర్జన భర్జనలు చేసుకొన్నమీదట - గరుడునికి దూరపు చుట్టం కదా, ఆమాత్రపు యోగ్యత లేకుండాపోతుందా అనే నమ్మకంతో గృధ్రరాజును గురువుగా ఎన్నుకొన్నాయి.

మొట్టమొదట కొన్ని దినాలు గద్ద అందరికీ పాఠాలు బాగానే చెప్పుతూవచ్చింది. అందరూ భరవాలేదంటే భరవాలే దనుకొన్నారు. బడికి తిరిగీ మంచిరోజులొచ్చినాయి కదా అని సంతోషించినారు.

అయితే ఆ ముచ్చట ఎన్నాళ్లు?

అవాంతరంగా కాకిగోల ఒకటి బయలుదేరింది. మృతవత్సపు కాకి చక్కటి సంసారాన్ని చట్టుబండలు చేసింది. తగవులమారితనానికి దిగింది. ఇరవై నాలుగ్గంటలూ అది గురువుగారిసన్నిధానంలోనే ఉంటూ, తన కందుబాటైన తిండితీర్థాలను ఆప్యాయంగా తెచ్చియిస్తూ గురువుగారిని ఆశ్రయించుకొనివుండి, వీలు చిక్కినప్పుడల్లా వారిమీదా వీరిమీదా చాడీలు చెప్పుకొంటూ గురువుగారి 'మంచిచూపు'ల్లో పడింది. లోగుట్టు తెలియనేరని గద్ద కాకి వినయవిధేయతలకు చాలా మెచ్చుకొని, తనకు ప్రియశిష్యుడుగా చేసుకొని, తనవద్ద అపురూపంగా వున్న దూరదృష్టినీ, పైకి - అంతరిక్షానికి ఎత్తుగా ఎగిరే శక్తినీ, ఇంకా ఇలాంటి పరమ గోప్యమైన విద్యలను ఉపదేశించింది.

ఇంక—గూబ ఏమి చేసిందో తెలుసునా? గురువుకే పంగనామాలు పెట్టబోయింది. "నాకంటె నీ గొప్పతనమేమిటి? క్రూరత్వంలోనూ, బలంలోనూ కూడా నేను నీకేమీ తీసిపోను. తెలుసునా? ఏమనుకొంటున్నావో" అని గురువుతో జగడమాడి, "ఛీ! నీ ముఖం చూడగూడదు. నీవు తిరుగులాడే పగటి పూట నేను బయటికే రాను— నీ ముఖావలోకనమే చేయను" అంటూ చీకటికోణాలను వెదకుకొని, అక్కడే నివాస మేర్పరచుకొన్నది. అప్పటినుంచీ ఆ జాతిజాతే పగటిపూట బయటికి రావటమే మాని వేసినాయి.

పరమసాధువైన పావురాయి ఎలాగైనా గురువుగారి దయ సంపాదించి గొప్పదశకు రావలెనని గురువుగారి మాటలను జవదాటకుండా, ఆయన అడు పాజ్ఞల్లో ఆయితే వుంటూవచ్చింది కాని దాని అదృష్టం పండలేదు. కాకి అడ్డుతగిలింది. కాకికి పావురాయి యీ వినయ విధేయత లేమీ సరిపోలేదు. దాని ఆట ఇలాగే సాగనిస్తే అసలు తనకే మోసం వస్తుం దేమో నని కాకికి భయం పట్టుకొంది. ఆ కడుపుమంటతో కాకి పావురాయిని ఆసాకూ ఈ సాకూ పెట్టి నానాహింసలూ పెట్టుతూవుండేది. గద్దతో నానా చాడీలూ చెప్పుతూ వుండేది.

ఇది ఇలా వుండగా—

ఒకనాడు గద్దగురువు పావురాయిని పిలిచి తన పిల్లలకు తినడానికి చిన్నచిన్న పిట్టలపిల్లలను తెచ్చి పెట్టమని అడిగింది. పావురాయి అందుకు ఒప్పుకో లేదు. "తల్లీపిల్లలను వేరుచేయరాదండీ. అది చాలా పాపమండీ. అదీ గాక నేను ప్రాణిహింస చేయలే నండీ. మన్నించండీ" అంటూ చెప్పుకొన్నది. ఈ మాటలు వినేసరికి—అదివరకే కాకిచాడీలతో రేగి పోయివుండిన గద్దకు వుండుమీద కారము చల్లినట్లయి మరింత రేగిపోయింది. "ఆఁ! నా మాటకు బదులు చెప్తావా? అంత కండకావరమా? అయితే నేటి నుండీ మీకూ మాకూ వైరము సిద్ధమన్నమాట. ముందు నా యెదుటనుంచి నడు. గురుద్రోహీ!" అని పావురాయిని తరుమగొట్టింది. అదిమొదలుకొని పావురాలకూ, గద్దలకూ బద్ధవైరము. పావురాలు కంటబడితే చాలు, గద్దలు గబుక్కున వాటిని అక్కున అందించుకొని అంతరిక్షానికి పోతాయి.

పక్షుల బడి యిలాగ పాడుపడిపోయింది. దేని దారి అది పట్టింది.



విమర్శనము

ఆంధ్ర సర్వస్వము

సంపాదకులు: శ్రీ మాగంటి బాపినీడు గారు;
ప్రకటించినవారు: విశాలాంధ్ర పబ్లిషర్సు, కందనిలయము, ౫, మౌంబ్రేసురోడ్డు, రాయపేట, మదరాసు.
వెల ౮ రూపాయలు.

"ఆంధ్రదేశమునకును, ఆంధ్రులకును సంబంధించిన విషయము లన్నీ ఇందుగలవు" అన్న వాక్యము ఈ గ్రంథమునకు బిరుదుకానోపు. "ఆంధ్రవికాస ప్రవర్తకులై కీర్తిశేషులయిన రావు బహదూర్ కందుకూరి. వీరేశలింగం (పంతులు), దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు (పంతులు) మహాశయుల స్మరణ చిహ్నముగా ఆంధ్రదేశమునకు (ఈ గ్రంథము) సమర్పిత" మయ్యెను.

మాగంటి బాపినీడుగారీ గ్రంథమునకు సంపాదకీయమును వ్రాయుచు "ఎందు కీ గ్రంథము?" అని ప్రశ్నించిరి. అందులకు వారే యీ విధముగా సమాధానమిచ్చిరి: "విజ్ఞానము, సంస్కృతి సర్వతోముఖముగా వ్యాపించియున్న దేశములందు ఇప్పుడు సకల విషయముల గురించిన్నీ కూలంకషంగా కాకపోయినా సంగ్రహముగానైనా ప్రస్తావిస్తూ రచించిన వ్యాసములు గల సంపుటి గ్రంథములు వెల్వడుతూ ఉన్నవి .... ఇట్టి గ్రంథములు ప్రతిభాషలోను ఉండదగిన గ్రంథము లనుట నిర్వివాదాంశము గనుక 'ఎందుకీ గ్రంథము?' అని ప్రశ్నించుట కవకాశమే లేదు." అసలు బాపినీడుగారి కీ ప్రశ్న ఏలపొడమెనో తెలియదు. కాని కొమర్రాజు లక్ష్మణరావు, కాశీనాథుని నాగేశ్వరరావుగార్లు సంకల్పించినంత గ్రంథము సాధ్యము కాదని తలచి కొలదిపాటి 'ఆశయముల' తో ఈ చిన్ని గ్రంథమును ప్రకటింప బాపినీడుగారు ఉద్దేశించినారు. "ఇందు ఆంధ్రులను గురించి అన్ని విషయములను గల"వని వారి విశ్వాసము. ఇది ఎంతవరకు నిర్వర్తింపబడినదో చదువరులకు తెలియగలదు.

"ఈ యాంధ్ర సర్వస్వము మన భాషలలో నపూర్వ మార్గములం గూర్పంబడి యగ్రగణ్యములయిన గ్రంథములలో నొక్కటి. ఇంటింట నుండఁదగినది. ఎల్లరును జదువవలసినది...ఇట్టి బృహద్గ్రంథ మీవరలో రచింపఁబడియుండలేదు. ఇఁకముందుఁ గ్రొత్తగ రచింప నవసరమును లేదు" అని డాక్టరు సర్ రామలింగారెడ్డిగారు తమ అభిప్రాయమును తమ 'తిలకాయమానవచన ముఖబంధమునందు' తీర్చి తెలిపిరి.

సకలవిషయ సంశోభితమైన యిట్టి సమగ్ర గ్రంథముయొక్క ప్రాశస్త్య మపార ముండవలయును.

ఈ 'సంహిత' క్రౌను వాల్గువంతు సైజున ముద్రింపబడినది. ఇందు ౫౭౬ పుటలు గలవు. చక్కగా ముద్రింపబడి బయిండు చేయబడి యున్నది.

ఈ బృహద్గ్రంథమునకు కారకులు, గ్రంథ స్వరూపమును నిర్ణయించినవారు మాగంటి బాపినీడుగా రొక్కరే అయినను, సంపాదకీయవర్గ మని మువ్వురైనారు. అందులో మోటూరి సత్యనారాయణగారు, డాక్టరు గిడుగు వేంకట సీతాపతిగారు మిగిలిన యిర్వురును. సర్వస్వము ప్రారంభించి సగము నడచువఱకు బాపినీడుగారే సర్వము నిర్వహింప గల్గిరి. మిగిలిన భాగమును బాపినీడుగారు సంకల్పించిన విధానమున యథావిధిగా నడిపించు భారము సత్యనారాయణగారు గూడ బందీకృతు లగుటవలన సీతాపతిగారిపై పడ్డట్లున్నది.

విషయసూచికయందు పదునాల్గు భాగముల క్రింద ఈ సంహిత విభజింపబడినట్లు తెలియుచున్నది. మొదటిభాగమునకు పేరు లేదు. అందు మూడు అధ్యాయము లున్నవి. (౧) ఆదినుండి ఆంధ్రులవరకు;

(౨) ఆంధ్రభూమి; (౩) కాలానుక్రమణిక. రెండవ భాగమునకు 'మతము' అను శీర్షిక యొసగబడినది. మరల మూడవ భాగమునకు శీర్షిక లేదు. ఇందు సంఘసంస్కరణము; సాంఘికసేవ, దానములు, మరణశాసనములు అను రెండు అధ్యాయములు కలవు. నాలుగవ భాగమునందు 'చరిత్ర' నాలు గధ్యాయములందు విభజింపబడినది. ఈ ప్రకరణమునందు రాష్ట్రేతర, ఖండాంతర ఆంధ్రులని యొక అధ్యాయమునందును, జమీందారులు మరియొక అధ్యాయమునందును వివరింపబడినవి. అయిదవభాగమున తొమ్మిది అధ్యాయములు 'ఆర్థికసంపద' అను శీర్షికక్రింద గలవు. అందు (౧) వ్యవసాయము, (౨) పశుసంపద, (౩) నీటివనరులు, (౪) అడవులు, (౫) ఖనిజసంపద, (౬) విద్యుచ్ఛక్తి, (౭) పరిశ్రమలు, (౮) పరకులవినుదల, (౯) ఆస్తి, బ్యాంకులు, కంపెనీలు అను విషయములు గలవు. ఆరవ భాగమునందు 'ఆరోగ్యము, ఆటలు' అను శీర్షికక్రింద రెండు అధ్యాయములు (౧) వైద్యము, (౨) ఆరోగ్యము - ఆటలు అని కలవు. ఏడవభాగమున 'తెలుగుభాష' నాలుగు అధ్యాయములుగా వివరింపబడియున్నది. మొదటిది ఆంధ్రవాఙ్మయచరిత్ర. దానివెనుక సాహిత్యానుబంధములు తొమ్మిదికలవు. రెండవ అధ్యాయమునందు 'గ్రంథాలయములు', మూడవదానియందు 'విద్య', నాల్గవదానియందు 'పత్రికలు' వివరింపబడియున్నవి. ఎనిమిదవ భాగమున 'కళ' ప్రత్యేకముగ రెండు అధ్యాయములందు వర్ణింపబడియున్నది. తొమ్మిదవ భాగమున జాతీయోద్యమముల చరిత్రలు గలవు. ఇందు ౧౨ ప్రకరణములు గలవు. పదియవ భాగమున 'ఆంధ్రజిల్లాల చరిత్ర' వ్రాయబడినది. పదునొకండవ భాగమున "ఆంధ్రదేశాభివృద్ధి ఎట్లు చేయనగును" అను డాక్టరు పట్టాభిసీతారామయ్యగారి వ్యాసమును, పండ్రెండవ భాగమున 'ఎవరెవరు?' అను విషయమును, పదమూడవ భాగమున 'ఆఫీ యిషీ' అన్న విషయములును, పదునాల్గవ భాగమున ఆధారగ్రంథముల పట్టిక ఇత్యాదులును తెలుపబడినవి.

ఈ 'ఆంధ్రసర్వస్వము' నిజముగా బాపినీడుగారు సంకల్పించినట్లు 'సర్వస్వము' గాదు; 'ఎన్సైక్లోపీడియా'యును గాదు, 'సైక్లోపీడియా'యును గాదు. అట్టి సర్వస్వమే యగుటకు కొన్ని లక్షణములు ఈ గ్రంథమునకుగూడ పట్టియుండవలెను. ఎన్సైక్లోపీడియాగాని, సైక్లోపీడియాగాని అయినచో నీసర్వస్వమున ఆంధ్రదేశమునకు సంబంధించిన అన్నివిషయములను ముందుగా అకారాది అక్షరక్రమముగా వ్రాసి, పిదప విషయనిర్ణయమున వాటిని సమకూర్పవలసియుండెను. అట్టి దీగ్రంథమున జరుగలేదు. కావున ఇది సర్వస్వ మనుటకు వీలులేదు. ఆంగ్లభాషయందు 'ఇండియన్ ఇయర్ బుక్' అనియు, 'హిందూస్థాన్ ఇయర్ బు'క్కనియు హిందూదేశమునుగురించి, ఒక్కొక్కప్పుడు ఒకరాష్ట్రమునుగురించి, అదేవిధముగా ఇంగ్లండు, రష్యా, అమెరికా, జర్మనీ, ఫ్రాంసు మొదలగు దేశములగురించి అప్పుడప్పుడు, ఏటేటా కొన్ని గ్రంథములు—తిరుచు చూచుకొని విషయములను, వృత్తాంతములను తెలుసుకొనుటకు వీలయిన గ్రంథములు వెలువడుచుండును. అట్టి గ్రంథములలో చేర్పదగిన దీ ఆంధ్రసర్వస్వము.

ఈగ్రంథము ఆంధ్రుల భాగ్యవశమున పునర్ముద్రణము నొందగల్గినచో చేయవలసిన సంస్కరణములు ఎన్నో కలవు. వాటి నన్నింటిని ఇచ్చట తెలుపుట అనావశ్యకము. కాని కొన్నింటినిమాత్రము సూచింతును. 'ఆంధ్రసర్వస్వము' అని పేరుపెట్టినపుడు నిజాంరాజ్యములో చేరిన తెలింగాణమును గూడ సంపాదకులు ఇందు చేర్పవలసి యుండెను. అట్లుచేర్పుటకు తమ కిష్టము లేకున్నచో 'బ్రిటిషాంధ్రసర్వస్వ' మని ఈగ్రంథమునకు పేరుపెట్టిన యుక్తముగా నుండెడిది. తెలింగాణముగూడ ఆంధ్రభూమిలో ఖండము కదా. దాని వైశాల్యముగూడ ౧౬౦౦౦ మైళ్లు గలదు. అచ్చటి ఆంధ్రులనుగూడ లెక్కచేసుకొన్నప్పుడే ఆంధ్రుల జనసంఖ్య రెండుకోట్ల అరవైలక్షలవరకు పెరుగును. వారినికూడ ఆంధ్రులలో చేర్చుకొన్నప్పుడే ఆంధ్రభాషకు హిందూదేశ భాషలలో నాల్గవ స్థానము లభించును. నాల్గవ భాగమున చేర్పబడిన 'ఆదిమనివాసులు', 'ఆంధ్రుల చరిత్ర'యు మొదటి భాగమున చేర్చుట యుక్తము. అన్నిటికంటె ముఖ్యము దేశముయొక్క ఆకారము, భూశాస్త్రము (Geography) మొదటి భాగములో వివరముగా తెలుపబడవలసి యుండెను. పదియవ భాగము కొంచెము మార్పులతో మొదటిభాగమునందే, ఆంధ్రుల చరిత్ర తరువాతనో, ముందో ఉండిన బాగుండును. నాలుగవ భాగములోని 'రాష్ట్రేతర, ఖండాంతర ఆంధ్రులు' అను శీర్షికక్రిందనే, ఇతరరాష్ట్రములందు ప్రతిభ గాంచిన ఆంధ్రవిద్యాధికుల (౩౭౮-౩౭౯ పుటలు) నుగూడ చేర్చియుండవచ్చును. అయిదవ భాగమున 'ఆర్థికసంప

దోయందు ఆంధ్రలోకమునకు కావలసిన విషయములు ఏవియు సమగ్రముగా తెలుపబడలేదు. ఆంధ్రభూమి విషయములను అటు తమిళనాడుతోను, ఇటు కర్ణాట మహారాష్ట్ర వంగ దేశములతోను సరిపోల్చి, మన కున్న విశిష్టతను తెలుపుచు పోవలయును. పశుసంపద విషయములో ఆంధ్రదేశమునకు అపారముగా, ఏమాత్రము అరికట్టబడకుండా జరుగుచున్న అపకారము కొంచెమయినా తెలుపబడలేదు. పశుసంపద విషయమై ఒక పరిశోధనాస్థానము ఉండవలసిన పరిస్థితులు సర్వస్వకారులు గుర్తింపలేదు. 'అడవులు' వర్ణించునపుడు ఆంధ్రదేశపు టడవులలో దొరకు కలప విశేషములు, టేకు, చంద్ర, చందనము, నల్లచేవ, తమాలము మొదలయిన వృక్షజాతుల సంపదవివరణ లేదు. అడవిసంపద ఎంత గలదో, దానిని ఎంతవఱకు అభివృద్ధిపరచుటకు మార్గములు కలవో వివరింపబడలేదు. విద్యుత్ విషయములో ఆంధ్రదేశము ఎంతో వెనుకబడి యున్నది. తమిళ భూమితో పోల్చి చూపించిన ఆవిషయము, ఆంధ్రులకు జరిగే అన్యాయము కూడ తెలిపియుండగలదు. ఆ దేవిధముగ నీటివనరుల విషయము, ఆంధ్రులకు చూపబడుతూఉన్న సవతితల్లిప్రేమ విశదము అయియుండును. పరిశ్రమలనుగూర్చి తెలిపినపుడు రాజమహేంద్రవరమున నున్న 'ది ఆంధ్రా పేపరుమిల్సు' ప్రస్తావనయే కానరాలేదు. ఆరోగ్యము, ఆటలు గురించి వ్రాసిన ఆరవభాగమునందు ఏ పేట ఆంధ్రదేశమున చెలరేగు అంటువ్యాధులనుగురించి గాని, వైద్యసహాయము దేశమున ఎంత లోపించియున్నదో తెలుపు పట్టికలుగాని ఏమియు వివరములు లేవు. వ్రాయబడిన వ్యాసమును నాల్గవవంతునకు సంక్షేపించవలసియున్నది. అది యందు అడ్వర్టయిజమెంటు వ్యవహారముగా కనిపించును. 'ఆటల' విషయమున దేశీయములయిన ఆటలకు, వినోదములకు ఎక్కడను తావు ఇందు చూపలేదు. జనాభాసంఖ్యలను అచ్చటచ్చట బహువిరివిగా సంపాదకులు ఇచ్చియున్నారు. ౧౯౩౧-వ సంవత్సరపునాటి సంఖ్యలను ఇచ్చుటకు మారుగా ౧౯౪౧ జనాభా సంఖ్యలను, ఇతర సంఖ్యలను ఏల యిచ్చియుండలేదో. ప్రాతపడిపోయిన యీ లెఖ్ఖలు పట్టి నిరుపయోగములు. 'మతము'లనుగూర్చి వ్రాసిన భాగమున హిందూ వైదికమునకు చాలా అన్యాయము చేయబడినది. వైదికమతమును సరిగా వర్ణించలేదు.

“శూద్రుల దురవస్థ దుర్భరముగా నుండెను. వేదములు, మంత్రములు ఉచ్చరించుటకే కాదు, వినుటకైనా శూద్రుల కర్హతలేదనిన్ని, వేదమంత్రములను విన్న శూద్రుల చెవులలో సీసము కరగించిపోయవలసినదనిన్నీ బ్రాహ్మణులు శాసిస్తూఉండుటచేత, బ్రాహ్మణులపై తక్కిన వర్ణములవారికి క్రోధము అధికమగుతూ వచ్చినది.” (౬) ఈ వ్రాత యీనాటి రాజకీయ వాతావరణమున మన స్థితిని తెలుపుచున్నది. ఆర్యానార్య జాతులసంఘర్షణములు నిత్యము జరుగుచుండిన అయిదారువేల యేండ్లనాటి కథలను సరిగా తెలుసుకొనక వ్రాయువారి వ్రాతలు జూగుప్సాకరములు. ఆనాటి సంఘమున శూద్రుడు ఆర్యజాతిలో లేడు. అతడనార్యుడు. ఆ భేదము నశించిపోయినతరువాత ఎందరో శూద్రులు బ్రాహ్మణు లయిరి. ఇందులకు చరిత్రయందు ప్రామాణ్యము గలదు. స్వధర్మమును కాపాడుకొనుట ఆనాడు నింద్యము కాలేదు. ఈ నాడు అయినది.

విశ్వమంతా ప్రేమమయమని చాటుచున్న ఈ కాలములో పాశ్చాత్య చరిత్రకారులు తమ ఉద్దేశములు నెరవేర్చుకొనుటకై వ్రాసిన అసత్యవాక్యాలను చిలుకలట్లు పలికి వ్రాసిన మన చరిత్రకారుల వ్రాతలను ప్రకటించుటలో అర్థము లేదు. బ్రాహ్మణద్వేషమును పురికొల్పు వాక్యము లిందు చాల గలవు. బ్రాహ్మణులు గూడ ఆంధ్రులే కదా. నాలుగైదు వేల యేండ్లనాడు ఆర్యసంఘములు, అనార్య సంఘములు ఎట్లుండెనో, కాలప్రవాహమున ఎన్ని మార్పులు జరిగెనో, వాటి నన్నింటిని ఐతిహాసికముగా గుర్తింపక చిలుకపలుకులను ప్రకటించుట యుచితము గాదు.

ఏడవ భాగము తెలుగు భాషను గురించి వ్రాయబడినది. ఇందు చర్చనీయాంశములు, అభిప్రాయభేదములు గల విషయములు ఎన్నో గలవు. అట్టివి లేకుండ వ్రాయవచ్చును. ఇందు మూడు అనుబంధములు చేర్చబడినను, జానపద వాఙ్మయమును గూర్చిగాని, యక్షగానములు మొదలయినవాటిని గూర్చిగాని యేమియు లేకుండు టాశ్చర్యకరము. వేటూరి ప్రభాకరశాస్త్రి, శ్రీ మానవల్లి రామకృష్ణకవి యిత్యాదు లెందరో భాషాసేవ చేసినవారు గలరు. వారిమాటయే లేదు.

ఆంధ్రుల చరిత్రయందు చాలా దోషములు దొర్లెను. వాటిని పునర్ముద్రణమునందు సవరించుకొనవచ్చును. ఒకటిరెండు మచ్చునకు చూపెదను. రామతీర్థ శాసనమును ప్రకటించినది (౧౧౩ పుట) మాధవ

వర్మ కాదు. ఇంద్రవర్మ అనే ఇంద్రభట్టారకుడు. సిరిసిరపురిసదకుని (శ్రీ వీరపురుషదత్తుడు) మామ గారు శక మహారాజు గాదు (౧౧౮ పుట). బుద్ధుని ఆస్తికలపైన విజయపురి అను మహాచైత్యము కట్టించలేదు.

ఈ సర్వస్వమున చిత్రములను పెక్కింటిని చేర్చినారు. ఇట్లు చేయుటవలన ప్రయోజనము అంతగా కలుగలేదు. ఈ చిత్రపటములను ఒక సూత్రము ననుసంధించి చేర్చియుండలేదు. దొరికిన వారి చిత్రపటముల నన్నింటిని చేర్చినారు. ఆకారణమున చిత్రపటము లన్నియు తారతమ్యములతో నిండియున్నవి. చాలామంది ప్రసిద్ధు లయినవారి పటములు లేవు. ముఖ్యు లయినవారివి ఒకప్పుడు అపహాస్యకరము లైనవి, వారివి కానివి, కడు చిన్నవి, త్రివిధ, చతుర్విధములుగా చేర్చబడినవి. కొన్ని చోట్ల ఒకరి పటమే రెండుసారులు చేర్చిరి. మరియు అనావశ్యకము లయినవి చేర్చబడినవి. ప్రసిద్ధు లయినవారి బొమ్మలు ఒక పద్ధతిమీద కూడబెట్టి ఒక సైజున ముద్రింపవలసియుండెను. అన్నింటికంటె చిత్రమయిన విషయము: నాగయ్యగారి పోతనవేషము, గౌరీనాథ శాస్త్రిగారి శ్రీనాథ వేషము ఇందు చేర్చుటవలన ప్రయోజనము కానరాదు. అటులనే కవిసమ్రాట్ గారి యూరేగింపు టుత్సవము మొదలయినవి. ప్రసిద్ధము లయిన దేవాలయ ప్రాసాదములను - ముఖ్యములయినవాటిని కొన్నిటిని చేర్చియుండవచ్చును. ప్రసిద్ధ చరిత్రకారులు, కవులు, విమర్శకులు అగువారి చిత్రపటములు చాలా వదిలివేయబడినవి. ఈలోపము లన్నింటివలన ఈ సర్వస్వమునకు సమగ్రత చేకూరలేదు. ఈ పుస్తకము నంతయు శ్రద్ధగా పరికించి చూడగా పూర్వము ప్రకటింపబడుచుండిన ఆంధ్రపత్రిక ఉగాదిసంచికలకును, దీనికిని సాదృశ్యము ఎక్కువగా కనిపించుచున్నది. నాగేశ్వరరావు పంతులుగారు చేసి చాలించుకున్న పనిని కాపిసీడుగారు సాగింప బూనుకొన్నట్లున్నది.

అనేక వ్యాసములు బహుచక్కగా రచించినవి గలవు. వాటి రచయితల పేర్లు తెలుపబడకపోవుట వింత గొలుపును. కొన్ని వ్యాసములు అనవసరముగా దీర్ఘములై యున్నవి. అట్టివి కొన్ని పెద్దఅచ్చులో కూడా ముద్రింపబడియున్నవి. కొన్ని వ్యాసములు నిరర్థకము లయినవి గలవు. వాటిని కనుగొని పునర్ముద్రణమునందు తీసివేయు టుచితము.

‘ఎవరెవరు’లో చేర్చబడవలసినవారు చాలా మంది గలరు. చనిపోయినవారిని బ్రతికియున్నవారి నుండి విడదీయుట యుక్తము. ఇరువురిని ఒకేకక్షకు చేరాదు. ‘ఎవరెవరు’లో రెండు భాగము లుండవలయును. నిన్నమొన్నటివఱకు బ్రతికియున్నవారిని ఒక భాగమున, ఇంకను మన యదృష్టవశమున సజీవులై యున్నవారిని రెండవభాగమున చేర్చు టుచితము.

ఈగ్రంథము సర్వస్వమని పిలువబడినను, ఇది ప్రచారకగ్రంథ మనిపించుకొనును. ‘సంఘసంస్కరణము’, ‘సాంఘికసేవ’, ‘మరణశాసనములు’ ఇట్టివి ప్రచారకము లేకదా. మొత్తముమీద రచనలన్నియు ప్రచారకోద్దేశముతో వెలసెను.

ఈసర్వస్వమునం దన్ని వ్యాసములు వ్యవహార భాషయం దైననేమి, సలక్షణమైన సభ్యతగల భాషయం దైననేమి చక్కని శైలిని వ్రాయబడియున్నవి. కాని గ్రంథమంతయు నొకరీతి భాషలో, శైలిలో వ్రాయబడియుండిన బాగుండెడిది. అందు లక్షణనియమము ఒకటి గాన్పించునుకదా! అయినను అమూల్యరత్నము లనదగిన వ్యాసములు కొన్ని గలవు.

ఈ సర్వస్వమునందు ప్రశంసింపదగిన విషయములు కొన్ని గలవు. మొదటిది ప్రచారకోద్దేశముతో ఇటువంటి ప్రచారక సర్వస్వమును సంకల్పించు టపూర్వమైనది. రెండవది దేశాభ్యుదయ సూచకము లయిన విషయములను గూర్చి వ్రాయబడిన వ్యాసములందు లెఖ్ఖలు (Statistics) సంపాదించి ప్రకటించుట. ఈ పని యింకను చేయవలసియున్నది.

ఈ సంహితను సృష్టికి దెచ్చిన కాపిసీడుగారు ధన్యవాదమున కర్హులు. ఇది ప్రథమ కృషి యగుట దీనియందు ఎన్నో లోపము లుండవచ్చును. భర్తగారు చెంతలేని సమయమున కడు దక్షతతో ఆయన వహించవలసిన భారమును తాను వహించి నిర్వర్తించిన సౌభాగ్యవతి శకుంతలాదేవిగారు ధన్యత నొంది ఆంధ్ర మహిళా లోకమునకు మార్గదర్శకు లయినారు. ఈ సంహిత త్వరలో పునర్ముద్రణమునకు రావలయునని నా ఆశయము. మొత్తముమీద ఈ బృహత్సంహిత వలన ఆంధ్రోద్యమమునకు కొంత ప్రయోజనము కలుగగలదు.

భావరాజు వేంకటకృష్ణరావు.

రష్యా యుద్ధకథలు

రచయిత: నికోలాయ్ తిఖనోవ్. అనువాదకుడు: విద్వాన్ విశ్వంగారు. సంపాదకులు: నవ్య సాహిత్యమాల, అనంతపురము. వెల రు. ౦-౬-౦.

ప్రస్తుతము చెలరేగుతున్న రష్యాయుద్ధములోని కొన్ని సంఘటనములను వస్తువుగా తీసికొని వ్రాయబడిన 'టేల్స్ ఆఫ్ లెనిన్‌గ్రాడ్' (Tales of Leningrad) అనే గ్రంథమునుండి సంగ్రహించిన ఆరువాక్కు చిన్నకథల చిన్నపుస్తక మిది. ఒక ప్రక్క పైనుండి బాంబులవర్షం కురుస్తూ ఉంటే ఒకానొక పట్టణపువీథిలో శిశువును ప్రసవించిన దీనురాలి ఉదంతము మొదటికథలో. యుద్ధముచేయుటకు తగిన శరీరపాటవము లేకపోయినప్పటికీ ఉత్సాహమువల్ల యుద్ధమున కేగిన కొడుకు రణరంగమున నెట్లు ప్రవర్తిస్తున్నాడో చూడవలెనని స్వయముగా వెళ్లి అక్కడ తక్కిన యోధులతో సమానంగా పోరాడుచున్న కొడుకును చూచి సంతోషించిన ఒక మాతృదేవియొక్క ఆనందము చిత్రితమైంది మరోకథలో. బాంబులవర్షము కురుస్తూవుంది; వాటిని తప్పించి మహోనిపుణంగా రైలును నడిపించుకొనిపోతున్నాడు ఇంజనుడ్రైవరు వేరొండుకథలో. ఇటులే కథలన్నింటిలోనూ వేరువేరు భయాశ్చర్య విస్మయజనకములగు సంఘటనలు వర్ణితములై యున్నవి. మొత్తముమీద అన్నీ కరుణోత్పాదకములు. ఇటువంటి ఉపద్రవసమయములలో ఎటువంటి సహనమూ, ధైర్యమూ, స్థిరతా, కార్యకరణవిధానము లవలంబించి సాధ్యమైనంతవరకు అపాయములనుండి తప్పించుకొనగలిగేదీ విదితమవుతుంది చదువరుల కీకథలను పఠించటంవలన.

శ్రావణి

ఏలూరు సాహిత్యమండలి చతుర్థ వార్షికోత్సవ సందర్భమున వివిధ రచయితలనుండి సంపాదించి కూర్చిన గద్య, పద్య వ్యాసముల సంపుటము. అన్నిరకముల కవిత్వములకును ఇందులో మాపలాలు కలవు. గ్రంథాంతమునందు ఆయారచయితల సంగ్రహపరిచయమును కూర్చి సంగ్రథనకర్తలు మంచిపని చేసినారు. సదరు సాహిత్యమండలి చేయుచున్న సారస్వతవ్యాసంగముల నివేదిక కూడ ఇందులోనున్నది. ఈ సాహిత్యమండలి కృషికి సంతసించుచున్నాము.

గ్రంథ స్వీకారము

ప్రబంధనాయికలు

గ్రంథకర్త: విద్వాన్ పుట్టపర్తి నారాయణాచార్యులుగారు, తెలుగుపండితుడు, మునిసిపల్ హైస్కూలు, ప్రొద్దుటూరు. క్రౌనుసైజులో ౧౨౮ పుటలు. వెల రూ. ౦-౧౪-౦.

చమురుగింజలు, ఇతర చముకుదినుసులు

గ్రంథకర్త: గోటేటి జోగిరాజుగారు, స్వయంపోషక కృష్యాశ్రమము, కొండెవరము, వయా పిఠాపురము. క్రౌనుసైజులో ౪౯౮ పుటలు. వెల రూ. ౧-౧౨-౦.

కుక్కుటేశ్వరశతకము

గ్రంథకర్త: వక్కలంక ...
బి. ఏ. ఆనర్సు, ...

Printed and Publish...
No. 7, Thambu...


ఇండియా టీలలో అత్యుత్తమము
LIPTONS
WHITE LABEL
TEA
LIPTONS
LIPTONS TEA GIRL
వైట్ లేబిల్
ములు

ణలలో మునుగవద్దు.